ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
31 జూలై, 2011

తెలుగు అమెరికా

2011 హ్యాపీబర్త్‌డే

(2011 జులై 31 నుంచి
2011 ఆగస్టు 6 వరకు)

చిన్నారి
1సం॥, ఆగస్టు-4
కళ్యాణి-రాంమోహన్‌రెడ్డి
కంజర్-నిజామాబాద్

పి. వెన్నెల
5సం॥, జులై-2006
విజయ-వెంకట్‌రెడ్డి
షాపల్లి-నల్లగొండ

హెచ్. నియతి
2సం॥, ఆగస్టు-5
జయశ్రీ-రాఘవేంద్రరావు
హైదరాబాద్

కె. చరణ్
1సం॥, జులై-31
రూబిజ్యోత్స్న-కిరణ్‌కుమార్

అమృత
6సం॥ జులై-2005
సుజా-సూరజ్
చేవెళ్ల-రంగారెడ్డి

ఎం. ఉమాశంకర్(నాని)
ఆగస్టు-4
కీర్తి-కిషోర్‌కుమార్
కర్నూలు

రోహిత్
2సం॥, జులై-2009
దుర్గ-సుబ్రమణ్యం
అచ్చయ్యనగర్-హైదరాబాద్

సాయి సాత్విక్ గౌడ్
జులై
స్వప్న-శ్రీనివాస్
కొల్లూర్-నిజామాబాద్

సిహెచ్. గీతాశ్రీ
10సం॥, ఆగస్టు-5
మహాలక్ష్మి-శ్రీమన్నారాయణ
పొలమూర్-ప॥గో

ENTERED

మనలో మాట

రాజా తీగ లాగితే...

తీగ లాగితే డొంక కదిలిందని పెద్దలంటుంటే కామోసు అనేకునేవారం. డొంకలు, తీగలు ఇప్పుడు అంతగా కన్పించవు! అందుకే కాబోలు పరమార్థం బోధపడలా! ఇప్పుడు దాన్ని కళ్లారా చూసే భాగ్యం కలిగించారు ఏలికలు. మన దేశ చరిత్రలోనే నలుపు ఇంకుతో తాటికాయంత అక్షరాలతో లిఖించబడిన స్కామ్ 2జీ. లక్షలకు లక్షల కోట్ల కుంభకోణాలకు అదో నాందీ ప్రస్తావన. కాకపోతే 2జీ అనగానే మదిలో మెదిలేది రాజాలు, కనిమొళిలు, మారన్లే. నాందీ ప్రస్తావనలో వారు పాత్రధారులు. మరి సూత్రధారులెవరు? మూడో కంటికి తెలియకుండా ముగ్గురు నల్గురే అంత భారీ స్కామ్ చేయగలిగారా? ఆ పాపమంతా డిఎంకే నేతలదేనా? మరెవరిదీ కాదా?



తీహార్ జైల్లో గాలి, నీరు రాజావారి ఒంటికి బాగా పడ్డట్టుంది. వారి బుద్ధి వెలిగిపోతోంది. సిబిఐవారు రాజా తీగ లాగే కొద్దీ యుపిఎ డొంక కదులుతూనేవుంది. రాజావారు కోర్టులో కఠోర వాస్తవాలను వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు మనం మిస్టర్ క్లీన్, మిస్టర్ పర్‌ఫెక్ట్ అనుకున్న వారు ఒక్కసారిగా విలన్ల అవతారంలో కనిపిస్తున్నారు. కాకపోతే రాజావారు నేటివరకు ఉపేక్షించకుండా ఇదేదో ముందే చేస్తే దేశం బాగుపడేది కదా అనిపిస్తుంది ఎవరికైనా.

దెబ్బ పడితేగానీ దెయ్యం వదలదుకదా. కటకటాల వెనక పడితేగానీ రాజావారి నోటి నుంచి నిజాలు బయటకు రాలేదు. తనేం చేసినా ప్రధాని సముఖానికి లేఖల రూపంలో తెలియచేశామంటున్నారు గడుసుగా. పైగా ఏమైనా తప్పనిపిస్తే అప్పుడే చెవి మెలిపెట్టవచ్చుకదా. అలా ఎందుకు చేయలేదనేది రాజా వారి ప్రశ్న. అంతేకాదు! కమలనాథుల కాలం నుంచీ ఇదే పద్ధతి నడుస్తోందికదా... తను చేసింది తప్పయినప్పుడు వారు చేసిందీ తప్పవుతుంది కదాని మెలిక పెడతారు. పూర్వాశ్రమంలో లాయర్ కావడంతో లా పాయింట్లు బానే లాగారు రాజావారు. ఈ లాపాయింట్లతో ఇటు కాంగ్రెస్ వారు, అటు బీజేపీ వారూ కంపించిపోతున్నారు.

మరి అంతేకదా విషయం తెలిసి ఆపలేకపోతే అసమర్థత. అనుమతిస్తే అవినీతి. ఈ రెండిట్లో ఏ కేటగిరీ కిందకు వస్తారో మన్మోహనులవారే తేల్చుకోవాలి. ఎంత సంకీర్ణం అయితే మాత్రం అవినీతిపరుడని తెలిసీ రాజాకు మంత్రి పదవి ఇచ్చానడం మాత్రం ఘోరం. వారి వాలకం చూస్తే ప్రభుత్వంలో వుండడమే ప్రధానం కానీ ప్రజలు కాదనిపిస్తోంది. ఇక మిస్టర్ పర్‌ఫెక్ట్ అని చిదంబరంగారికి హోం అప్పగించారు. వారేమో ఎవరు ఏం బొక్కుతున్నా చూస్తూ ఊరుకున్నారు. దేశాన్ని దోచుకుంటుంటే నిస్తేజంగా చూస్తుండడం కూడా నేరమేకదా.

ఈ తీగలు, డొంకలు, కుదుపులు, కంపనాలు, ఉపేక్షలు, ఉల్లంఘనలు చూస్తుంటే ఒకటి మాత్రం నిజమనిపిస్తోంది. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్ దిగ్గజాలు, ఆషాఢభూతి అధికారులు అంతా కలిసి దేశ ఖజానాను కొల్లగొట్టి తింటున్నారు. ఇప్పటి వరకు బయపడిన పెద్ద పెద్ద తలకాయలే కాక రాని వారు ఇంకెందరున్నారో! ఈ టెలిఫోన్ తీగ ఇంకా ఎంత దూరం తీసుకెళుతుందో!! రాలనున్న తలలేవో వేచి చూడాలి!!!

✶

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	4
ఈ పేజ్	...	6
సినిమా కబుర్లు	...	8
చిన్నకథ	...	10
రుచి	...	11
అట్టమీది కథ	...	14
కొత్తపుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

గొడుగు గుసగుసలు ... 3

తెలుసుకుందామా ... 12

సోలార్ వెలుగులు...



కథ ... 18

సహజీవనం

వికాసం ... 20

ఆహారం

అపోహలు - యదార్థాలు



చదవాలనిపించేలా...

ఈ వారం అట్టమీది కథ 'అనంత పద్మనాభుడు' ఆసక్తిదాయకంగా ఉంది. గోనుగుంట్ల మురళీకృష్ణ అందించిన 'స్థితప్రజ్ఞత' కథ బాగుంది. ఎనీమియా ఎందుకు వస్తుందో 'వికాసం' శీర్షికలో చక్కగా వివరించారు. 'కాపీ పేస్ట్' కళాఖండాలు విభిన్నరీతిలో అలరించాయి. 300 వాద్యాలను సేకరించిన 'కర్ణాటక కళాశ్రీ' అంగ్‌క్రంగ్ అన్నపూర్ణ గారికి మనస్ఫూర్తి అభినందనలు. 'సినిమా కబుర్లు' ద్వారా ఎందరో తెలియని వారి గురించి తెలుసుకుంటున్నాం. 'ఆశగా ఉంది' అంటూ ఊహల్లో మాత్రమే సాధ్యమయ్యే సన్నివేశాల్ని కవితాక్షర బద్ధం చేసిన ఎస్.రసూల్ అభినందనీయులు. 'చూద్దామా' ద్వారా కేరళ ప్రకృతి సోయగాలను, ఆహ్లాదభరిత వాతావరణాన్ని మా కళ్లముందుంచారు. కొత్తపుస్తకాల శీర్షికలో వచ్చే పుస్తకాలన్నీ చదవాలనిపించేలా ఉంటున్నాయి. 'బాల నేస్తాలు'లో వారం వారం ఏదో ఒక పక్షి గురించి వివరించడం బాగుంది. 'ఈ పేజ్' ద్వారా విలువైన సమాచారం అందుతోంది. మనలో మన మాటండీ... ప్రజలందరికీ సుఖపడే యోగం లేకపోగా 'పన్నుపోటు' బాధలు అదనపు కష్టాలన్నమాట. హతవిధీ... అలాగే గతవారం ప్లాస్టిక్ మీద 'కవర్‌స్టోరీ' చదివిన వారిలో కొందరైనా వాటిని వాడడం మానేస్తారేమో అనిపించింది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

భూగర్భ గనుల వంటివి...

ప్రకృతి సోయగాలకు నిలయంగా కేరళ రాష్ట్రం సకల జీవరాశిని తన్మయత్వంలో ముంచేస్తుంది. ఇటీవల సంచలనం కలిగించిన పద్మనాభుని ఆలయం కూడా అక్కడే ఉండడం మరో విశేషం. పద్మనాభుని సంపద భూగర్భ గనుల వంటిది. అవన్నీ భక్తులు, ప్రజలు ఇచ్చిన కానుకలు. వాటిని ప్రజాప్రయోజనాలకే వినియోగించాలి. 'కాపీపేస్ట్' కళాఖండాలు అద్భుతంగా ఉన్నాయి. ఉల్లంకి పిల్లనగ్రోవి అరుపు విశేషాలు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ఉన్నదున్నట్లు...

అనంత పద్మనాభుని వైభవం చదివి ఆశ్చర్యపోయాం. రాజుల పైసలు రాళ్లపాలన్నట్లు ఇన్ని లక్షల కోట్ల సంపద ముందు ముందు ఎవరికి దక్కనుందో! 'మనలో మాట'లో పన్నులమీద ఉన్నదున్నట్లు కుండ బద్దలు కొట్టారు. ప్రకృతి సోయగం కేరళ సొంతం. ఇది ఎలాంటి వారికైనా హాయి గొలుపుతుంది.

బిక్కునూరి రాజేశ్వర్,
పొన్కల్.

... ఆ ఖర్చుతో

ఈ వారం సంచిక మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. అట్టమీద కథగా వచ్చిన అనంత పద్మనాభాలయాన్ని గురించిన విశేషాలు చాలా తెలుసుకున్నాం. ప్రజలు బీదరికంలో నలిగిపోతుంటే ఆలయంలో ఎంత ధనముంటే మాత్రం ఏం లాభం? నిజానికి దేవుడికి ఆర్భాటాలు, ఆడంబరాలు, ఆభరణాలు ఇవేవీ అక్కర్లేదు. ఆయన నైవేద్యానికి చేసే ఖర్చుతో ఎంతోమంది పేదల కడుపు నిండుతుంది. ఇటువంటి సొమ్ము పేదలైన అర్హులకు చేరితే మేలు జరుగుతుంది. ఎక్కువ సాన్నిహిత్యాన్ని పెంచుకుని బాధపడేకంటే మామూలుగా

ఉండడమే మంచిదనే విషయాన్ని 'స్థిత ప్రజ్ఞత' తెలిపింది. 'కవితలు' బాగున్నాయి. 'నవ్వుల్ పువ్వుల్' కడుపుబ్బా నవ్విస్తున్నాయి.

మోతి మోహనరంగా,
సూర్యాపేట్.

దేని చరిత్ర చూసినా

మన దేశంలో దేవుడి పేరుతో ప్రాణంలేని బొమ్మలకు పట్టు పీతాంబరాలు, కోట్ల ఆస్తులు కూడబెడుతున్నారు. అదే దేవుడి గుడి చుట్టూ ఉన్న మామూలు ప్రజలకు ఆకలి చావులు, అనారోగ్యాలే మిగులుతున్నాయి. కవర్ స్టోరీ స్ఫూర్తిదాయకంగా ఉంది. ఏ దేవాలయాల చరిత్ర చూసినా శ్రమజీవుల కష్టం, రాజుల నిరంకుశత్వమే కనిపిస్తుంది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక.





తొలకరి చినుకుల్లో తడవాలని ఎవరికుండదు చెప్పండి? చిరుజల్లులో తడుస్తూ అలా అలా నడుస్తుంటే.... ఆ హాయే వేరు. కానీ అది కాస్తా పెద్ద జడివానగా మారితే రక్షణ వెతుక్కోక తప్పదు. వర్షానికే కాదు, మండుటెండల్లోకూడా రక్షణ అవసరమే. ఇలా రెండు రకాలుగా మనకు రక్షణనిచ్చేది గొడుగు.



గొడుగు గుసగుసలు

గొడుగు గురించి చెప్పుకోవాలంటే బోలెడు సంగతులున్నాయి. ఇప్పుడంటే చాలా రకాల గొడుగులొచ్చాయి కానీ 20 ఏళ్ల క్రితం నల్ల గొడుగులే ఉండేవి. అవీ చిన్నగా వుండేవా అంటే అదీ కాదు... దగ్గర దగ్గర ఓ మీటరు పొడవుండేవి. వాటిని పట్టుకుని ఎలిమెంటరీ స్కూలుకి పోతుంటే భలేగా ఉంటుందిలే. టీచరు కూడా అమ్మో... వర్షం పడుతున్నా కూడా బడికి వచ్చేశారే అని పొగుడుతుంటే గొప్పగా ఫీలైపోతూ అందరి వంకా చూడడం... ఆ ఆనందమే వేరు.

స్కూలుకి వెళ్తూ మనమొక్కళ్లమే వెళ్తామా? కాదు. మన వెంట మరో ఇద్దరు ముగ్గురిని వెంటేసుకెళ్తాం. వెళ్లే దారిలో ఆ గొడుగు గురించి స్నేహితులకి ఎన్నెన్ని కబుర్లు చెప్తాం. అది ఎవరు తెచ్చారో, ఎక్కడ్నుండి తెచ్చారో ఇలా... స్కూలు వచ్చేవరకు చెప్తూనే ఉంటాం.

ఇంకొంచెం పెద్దయి హైస్కూల్‌కెళ్లామంటే ఆ నల్లగొడుగు అస్సలు నచ్చదు. రంగురంగుల పూల గొడుగులు కనిపిస్తుంటే ఇంకా ఆ పాత గొడుగును పట్టుకు వేలాడ్డమా అంటూ దాన్ని ఓ మూల పడేస్తాం. ఆ కొత్తది మామూలుగా అల్లాటప్పా గొడుగుల్లా కనిపించకూడదు. మన దోస్తులందరి వాటికంటే ప్రత్యేకంగా కనిపించాలి. ఫ్యాషన్‌గా ఉండాలి. మరీ పెద్దగా కనిపించకూడదు. అంటే దాన్ని ఒక మడతపెట్టి చిన్నదిగా చేసి బ్యాగులో పెట్టుకోవాలి. అలా ఉంటేనే నచ్చుతుంది.

ఇక కాలేజీకెళ్లామంటే ఒక్క వర్షానికే కాదు, ఎండొచ్చినా గొడుగు పట్టుకెళ్తాం. వేసుకున్న డ్రెస్‌కి మ్యాచయ్యేలా కొత్త కొత్త డిజైన్ల గొడుగుల మీదికి మనసుపోతుంది. వాటితో ఎంచక్కా ఫోజు కొట్టొచ్చు. ఇలా ఎన్నెన్ని తీపి జ్ఞాపకాలో.

ప్రేమకీ గొడుగే....

వానకీ గొడుగుకీ ప్రేమకీ బోలెడు అనుబంధముంది. 'చిటపట చినుకులు పడుతూ ఉంటే... చెలికాడే గొడుగే పడితే... చెప్పలేని ఆహాయి ఎంతో గొప్పగ వుంటుందోయి...' గొడుగుతో నడిచే ఏ ప్రేమజంటను చూసినా ఇప్పటికీ నర్గీస్ రాజ్‌కపూర్‌లే గుర్తొస్తారు.

అయితే ఇప్పటికీ వానొస్తే తప్ప గొడుగులు తెరిచే అలవాటు మనకంతగా లేదు కానీ, విదేశీయులకయితే చేతిలో ఎప్పుడూ గొడుగుండాల్సిందే. అక్కడి వాతావరణంలోని హెచ్చుతగ్గులే అందుకు కారణం. అందుకేనేమో గొడుగుల్లో రకాలూ, ఫ్యాషన్లూ అన్నీ అక్కడ ఎక్కువగా ఉంటాయి. ఆ గాలి మనకీ బాగానే సోకిందని చెప్పాలి. తాతల కాలం నాటి తాటాకు గొడుగులు పోయాయి. కాటన్, పాలిస్టర్, నైలాన్లకీ కాలం చెల్లిపోయింది.

టెఫ్లాన్ కోటింగుతో సెకన్లలో ఆరిపోయే కొత్త గొడుగులొచ్చాయి. ఒకటి, రెండు, మూడు మడతలుగా బ్యాగుల్లో ఒదిగిపోయేవే కాదు జేబుల్లో పట్టే ప్లాస్టిక్‌వీ ప్రవేశించాయి.

చీకటిలో దారి చూపే గొడుగులూ ఉన్నాయి. షార్పీ కంపెనీ తయారు చేసిన గొడుగు ఇదే. బటన్ నొక్కగానే గొడుగు తెరచుకోవడంతో బాటు అందులోని లెడ్‌లైట్లు వెలుగులు విరజిమ్ముతాయి. గొడుగుమీద వాన చుక్కలు మెరుస్తున్నాయా అని అబ్బురపడేలా స్వరోవ్‌స్కీ క్రిస్టల్స్‌తోనూ రూపొందుతున్నాయి. ఈదురుగాలుల్ని తట్టుకునేలా రెండు పొరలతో తయారైన విండ్రెల్లాలూ, పిల్లల్ని తోసే ట్రాలీలకే గొడుగులున్న బగ్గీట్రాలీలూ.. అబ్బో, బోలెడు వెరైటీలు.

ఇవే కాకుండ ఇంకా కొత్త కొత్త రకాల గొడుగులొచ్చాయి.

డోమ్ గొడుగులు : ఇవి ప్లాస్టిక్‌తో తయారైనవి. వీటిలోనుండి బయటి ప్రపంచమంతా చూడొచ్చు.

సిల్వర్ ప్యాక్ గొడుగులు: ఇవి సూర్యుని నుండి వచ్చే అతినీలలోహిత, పరారుణ కిరణాల నుండి కాపాడతాయి.

నూబ్రెల్లా : వీటిని పట్టుకోనక్కర్లేదు. తలపై టోపీలా తగిలించుకోవడమే. అయితే టోపీలా తలవరకే కాకుండా భుజాల కింది వరకు ఉంటాయి.

ఎండావానా అంబ్రెల్లాల పండగ

వాతావరణాన్ని తట్టుకోలేక బ్రిటీష్‌వాళ్లే పద్దెనిమిదో శతాబ్దంలో గొడుగును కనిపెట్టారంటారు. కానీ గొడుగు ప్రాచీన కళ.

➻ వెదురు, మల్బరీ కాగితంతో మొట్టమొదటగా చైనా వాళ్లు తయారు చేశారు. ఇప్పటికీ చైనా, జపాన్, థాయ్ దేశాల్లో ఈ కాగితం గొడుగుల అల్లిక హస్తకళగా ఉంది. అక్కడి సంప్రదాయ వేడుకల్లో గొడుగులది ఇప్పటికీ అగ్రస్థానమే. అయితే వాళ్లకన్నా ముందే ఈజిప్టియన్లు గొడుగును తయారు చేశారని, అక్కడ్నుండే చైనాకు వచ్చిందని వాళ్లు చెబుతారు. ముందుగా ఎవరు కనిపెడితేనేం.... ఎండావానల నుండి రక్షణ కోసం గొడుగు తయారైంది. ఇప్పుడిది ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉంది.

➻ ఈజిప్టులో ఫారో చక్రవర్తులు తమ రాజరికానికి గుర్తుగా గొడుగును వాడేవారు. అంతెందుకు పురాణ గాథలైన మహాభారతం, రామాయణంలోనూ రథాలకు గొడుగులు కనిపిస్తాయి.

➻ థాయ్‌ల్యాండ్ బొరసాంగ్ అనే గ్రామం గొడుగుల నగరంగా పేరుపొందింది. అక్కడ ఏటా గొడుగుల పండుగ కూడా జరుగుతుంది.

➻ అంబ్రెల్లా, పారాసాల్... రెండూ లాటిన్ పదాలే. కానీ సాల్ అంటే సూర్యుడు అని అర్థం. అందుకే ఎండను అడ్డుకునే వాటిని 'పారాసాల్స్' అనీ వాన నుండి కాపాడే వాటిని 'అంబ్రెల్లా' అనీ యూరోపియన్లు పిలుస్తారు.

➻ ప్రపంచమంతా గొడుగులు వాడినా ఇంగ్లాండులోనే వీటి వాడుక ఎక్కువ. లండన్‌వాసులు బస్సుల్లోనూ, సబ్‌వేల్లోనూ ఏటా 75 వేల గొడుగులు మర్చిపోతారట.

➻ ఇంట్లో గొడుగు తెరిస్తే అపశకునంగా భావిస్తారు ఇంగ్లీషువాళ్లు.

★

నాకు తెలియని నేను

కరకట్టపై పల్లవించిన గరిక
కాలికింద కార్పెట్లు పరిచింది
విరిసిన మంకెన పూలు
పచ్చని తివాచీ పాలభాగాన సింధూరం
చన్నీటి స్నానమాచరిస్తూ శశాంకుడు
సిగ్గుతో ఎరుపెక్కిన చెక్కిళ్ల తార
ఏటి నీటి ప్రవాహం
కరకట్టను కోస్తున్నది
నీటిని నిందించాను
గంగ నవ్వింది
ఉధృతమై హద్దుల్ని చెరిపే తనని
హద్దుల్లో పెట్టమంది!
దీపం వెలిగింది
చీకట్లను తరిమింది
ఆగ్రహించిన గాలి ఆయువె తీసింది
మళ్లీ వెలిగిన దీపం
మరోసారి మరణించింది
ప్రభంజనాన్ని నిందించాను
వాయువు నవ్వింది

తన శక్తిని ఎదిరించే
రక్షణ కవచం కల్పించమంది!
నీడలేని జీవికి
పూరి గుడిసె నివాసం
ఆకలిగొన్న అగ్నికి
అభాగ్యుడి గుడిసె ఆహుతి
అగ్నిని నిందించాను
అంగారం నవ్వింది
తాను జ్వలించినా రగలని
నీడను నిర్మించమంది!
చిల్లులు పడ్డ ఆకాశం
కుండపోతగా కురుస్తున్నది
ఇళ్లు ఇంకుడు గుంటలయ్యాయి
వరుణుణ్ణి నిందించాను
వర్షం నవ్వింది
నేనెంత ప్రళయమైనా
ప్రతిఘటించే పై ఎత్తు వెయ్యమంది!
మేల్కొన్న ఆలోచన
నాకు సుప్రభాతం పలికింది
నీలో చేతన ఉంది, శ్రమ ఉంది
ఆచరణ ఉంది, అంకితం ఉంది
నిర్మాణంలో లోపం ఉంది
నాతో నేను మాట్లాడుతూ ఉంది!

- అడిగోపుల వెంకటరత్నమ్

కవిత్వమ్

అరుపు కాదు ఆవేదన

ఎంగిలాకుల మీద మెతుకులేరుకొనే
కాకులను చూస్తే చాలా జాలేస్తుంది
పారేసిన మెతుకులను
ఆవురావురుమని ల్టొటలేస్తున్నందుకు కాదు
కుక్కలతో పోటీ పడి విస్తర్ల మీద
సిగ్గు విడిచి దేవురిస్తున్నందుకు కాదు
ఐనా అవెప్పుడూ చూస్తున్న దృశ్యాలే!
అవి ఆకలి తీర్చుకోవడం కోసం
పెరట్లో అంట్ల గిన్నెలపై వాల్లేదా ఏంటి?
ముసలమ్మలు కర్రల్తో తోలేసినా
ఇంటిపట్టునే ఏ చెట్టుకొమ్మనో వుండేవి!

ఊరకుక్కలతో పాటు
అవీ మన ఇంటిబిడ్డలే కదా!
అది కాదు నా బాధ
ప్లాస్టిక్ ప్లేటులొచ్చి కమ్మని అరిటాకుల వాసనకి
కాకుల్ని దూరం చేస్తున్నాయని
ఏ మూలో మిగిలిన ఆహార తునకలు కూడా
ఇప్పుడు దొరకడం కష్టమౌతుందని
"కాకుల కడుపుమంటని ఎగిరే పుణ్యవతి అరిటాకు"
ప్రపంచీకరణ వల్ల మనమూ, మన తోటి ప్రాణులూ
సహజత్వాన్ని కోల్పోతున్నామనే నా బాధ!

బీదరికం

సూర్యకిరణాలు వీస్తున్నాయి
వెన్నెల రాత్రులు నడుస్తున్నాయి
రోజులు రేయి పగలుగా
పరుగులు తీస్తున్నాయి
కానీ బీద ప్రజల బాధలు
వ్యధలుగానే మిగులుతున్నాయి
ధనవంతుల చేతులలో
కీలుబొమ్మలుగా ఊడిగం చేసుకుంటూ
పొట్ట కూటికోసం
రాత్రింబవళ్లు కష్టించినా
తిండికి, బట్టకు సరిపడదాయె
అప్పలు జేసి బతుకుడాయె
కాలచక్రం తిరుగుతుండె
నెల గడవాలంటే చిక్కులుండె
హైటెక్ పరుగులతో



అత్యాధునిక యంత్రాలు వచ్చి
శ్రమదోపిడీకి సాక్షాత్కారంగా నిల్చినవి
ప్రభుత్వాలు నిత్యావసరాలు పెంచి
ప్రజల్ని బికారులుగా మార్చవట్టే
వడ్డీల భారం మోయలేక
బిడ్డల్ని చదివించలేక
అయ్య అవ్వలకు బుక్కెడు బువ్వ పెట్టలేక
కూతురి పెండ్లి చేయలేక
తలపై ముళ్ల కిరీటం మోస్తుంది బీదరికం
అధికార గణం ప్రజల ఘోష విని
పని కల్పించే రోజు ఎప్పుడో
నిరీక్షించి ఎదురు చూద్దాం
కష్టపడి ముందుకు సాగుదాం

- ఉండ్రాల రాజేశం

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-97890 99589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI
KVR INSTITUTE ™
AWARD WINNER
New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.



సాధారణంగా కొన్ని బ్రాండెడ్‌నేమ్‌లకు అపరిమితమైన క్రేజ్ వుంటుంది. ఆ క్రేజ్‌ను ఉపయోగించుకొని దాన్ని అనుసరించేవారు, అనుకరించేవారు అనేకమంది పుట్టుకొస్తారు. ఒక సినిమా హిట్ అయితే కుడిఎడమగా అదే పేరుతో అనేక సినిమాలు రావడం మనకు తెలుసు. 'ఈనాడు' పేపర్ వున్నట్లుగానే 'ఈనాడు అగర్‌బత్తి' కూడా వుంది. విజయవంతమైన ప్రతి విషయంలోనూ అనుకరణలు సహజం. ఈ అనుకరణలు తమ స్థాయిని దాటిపోయి అసలుకే ఎసరు పెట్టేవరకు వచ్చే సంఘటనలూ జరుగుతూనే వుంటాయి. ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థను అనుకరిస్తూ వెలిసిన మరో సంస్థ అసలు సంస్థకు సంబంధించిన ట్రేడ్‌మార్కునో, బ్రాండ్‌నేమ్‌నో, దాని హక్కులనో అడ్డదారిలో దొంగిలించడం వంటివాటినే ఇంటర్నెట్‌లో 'సైబర్ స్క్వాటింగ్' అంటారు. అసలైన సంస్థలు దీనిని 'ఘరానా మోసం' అంటుంటే, సైబర్ స్క్వాటర్లు దీన్ని 'లాభసాటి వ్యాపారం' అంటున్నారు. అదేవిధంగా ఏదైనా ఒక సంస్థ 'సింహం' ట్రేడ్‌మార్క్‌తో అగర్‌బత్తీలను తయారు చేస్తుందనుకోండి. అదే 'సింహం' బొమ్మను ఇంకెవరూ వాడకూడదనడమూ హాస్యాస్పదంగానే వుంటుంది. ట్రేడ్‌మార్కులు, బ్రాండ్‌నేమ్‌ల ఆధారంగా సాగే 'సైబర్ స్క్వాటింగ్'లో అనేక కోణాలున్నాయి.

సొమ్మొకరిది... సోకొకరిది

ఇంటర్నెట్ గురించి తెలిసినవారందరికీ బ్లాగ్‌ల గురించీ తెలుసు. వారిలో ఎక్కువమందికి బ్లాగులూ వుంటాయి. అయితే చాలామందికి తాము కోరుకున్న పేరుతో మాత్రం బ్లాగ్ లభించదు. ఎందుకంటే అప్పటికే వేరొకరు మనకు కావాల్సిన పేరుతో క్రియేట్ చేసుకొని వుంటారు. ఉదాహరణకు www.prajasakti.blogspot.com పేరుతో బ్లాగ్ కావాలనుకుంటే, అప్పటికే ఆ పేరుతో మరొకరు బ్లాగ్ క్రియేట్ చేసుకొని వుంటారు. మనకు అదే పేరుతో బ్లాగ్ కావాలంటే www.prajaasakti.blogspot.com అనే విధంగా ఒకటి, రెండు అక్షరాల మార్పుతో క్రియేట్ చేసుకోవాల్సిందే తప్ప అసలు పేరుతో మాత్రం దొరకదు.

ఇమెయిల్స్‌లోనూ ఇదేరకంగా వుంటుంది. మనకు కావాల్సిన పేరుతో మెయిల్ ఐడీ దొరకదు. బ్లాగ్స్, ఇమెయిల్సే కాదు, పెద్దపెద్ద సంస్థల వెబ్‌సైట్ల విషయంలోనూ ఇలాగే జరుగుతుంది. అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్ www.whitehouse.gov రిజిస్ట్రేషన్ చేసేనాటికి www.whitehouse.com పేరుతో ఒక అశ్లీల వెబ్‌సైట్ రిజిస్టర్ అయి వుంది. ఆ తర్వాత దాన్ని బ్లాక్ చేసారనుకోండి. ప్రస్తుతం అదేపేరుతో వేరొక సైట్ నడుస్తోంది. ఇదే తరహాలో అనేక వెబ్‌సైట్స్ వున్నాయి. వెబ్‌సైట్ అనగానే ఆ పేరు పక్కన డాట్‌కామ్ అని టైప్ చేసే అలవాటున్న యూజర్లకి అసలు సైట్‌కు బదులు మరో సైట్ దర్శనమిస్తుంది.

అదేవిధంగా వాడుకలోవున్న ప్రముఖ పదాలను, వాటి ప్రాముఖ్యతను ముందే గుర్తించి ఆయా పేర్లతో డాట్‌కామ్‌లను రిజిస్టర్ చేసే దూరదృష్టి కలిగివుండడమే 'సైబర్ స్క్వాటింగ్'. ఇట్లా ముందుగానే రిజిస్టర్ చేసి పెట్టుకుని వాటిని సొమ్ము చేసుకొనేవారిని 'సైబర్ స్క్వాటర్లు' అంటారు. ఈ లాభం అనేక రకాలుగా వుంటుంది. ప్రముఖ సంస్థ వెబ్‌సైట్‌కి వెళ్ళాలనుకున్న యూజర్లను దారిమళ్ళించడం వల్ల గానీ, లేదా ఏదైనా ప్రముఖ సంస్థకు తమ పేరుతో వెబ్‌సైట్ అవసరమైనప్పుడు అత్యధిక ధరకు అమ్మడం వల్లగానీ లాభాలు గడిస్తారు.

ఇంటర్నెట్ ప్రారంభంనాటి రూపానికీ ఇప్పటి రూపానికీ పొంతనే లేదు. అసలు ఇంటర్నెట్ అనేది ఈ స్థాయిలో అభివృద్ధి అవుతుందని, ఇంటర్నెట్ వేదికగా ఇ-కామర్స్ వంటి ఎలక్ట్రానిక్ వ్యాపారాలు సాగించవచ్చుని దాదాపు పది పదిహేనేళ్ళ క్రితం ఊహించివుండరు. సరిగ్గా ఈ భావనే 'సైబర్ స్క్వాటింగ్' అనే ప్రక్రియకు కారణమైంది. సాంకేతిక చైతన్యం, దూరదృష్టి గల కొందరు మహానుభావులు పెద్దపెద్ద సంస్థలన్నీ ఏదోకనాటికి వెబ్‌సైట్లను ప్రారంభించక తప్పదని ముందుగానే ఊహించారు. ప్రారంభంలో నామమాత్రంగా వున్న రిజిస్టర్ ఫీజు చెల్లించి ప్రముఖ పేర్లు, బాగా వాడుకలో వున్న పేర్లన్నిటితో వందలాది వెబ్‌సైట్లను రిజిస్టర్ చేసేసారు. తర్వాతికాలంలో ఇంటర్నెట్ అవసరాన్ని గుర్తించిన ప్రముఖ సంస్థలు తమ సంస్థల పేరుతో అప్పటికే వెబ్‌సైట్ రిజిస్టర్ జరిగిందని తెలిసి, నిర్ఘాంతపోవడం, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం అనివార్యమైంది. ఈ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ఎంతదాకా వచ్చిందంటే ఏదైనా ఒక ప్రత్యేక అంశానికి సంబంధించి వెబ్‌సైట్ పెట్టాలనుకుంటే- మొదట స్ఫురణకు వచ్చే పదాలన్నీ దాదాపుగా రిజిస్టర్ అయిపోయే పరిస్థితి ఏర్పడింది.

సైబర్ స్క్వాటింగ్

డిక్షనరీ అర్థంలో చెప్పాలంటే- ఇతరుల స్థలంలో తవ్వకాలు సాగించడం, భవనాలు నిర్మించడం వంటి పనుల్ని 'స్క్వాటింగ్' అని చెప్పవచ్చు. దీనినుంచే 'సైబర్ స్క్వాటింగ్' అనే పదం పుట్టింది. 'ట్రేడ్‌మార్క్ సైబర్ పైరసీ ప్రివెన్షన్ యాక్ట్' (టిసిపిఎ)- "ఇతరుల గుడ్‌విల్ నుంచి లబ్ధిపొందే దురుద్దేశంతో వెబ్‌సైట్ పేర్లను రిజిస్టర్ చేయడం, అమ్మడం, ఉపయోగించడాన్ని" 'సైబర్ స్క్వాటింగ్'గా పేర్కొన్నది.

అయితే ఇటీవల కొందరు మూకుమ్మడిగా ఎక్కువ డొమైన్లు రిజిస్టర్ చేసే వాళ్ళని, తన డొమైన్లను అమ్మే ప్రతివారినీ 'సైబర్ స్క్వాటర్' అంటున్నారు. నిజానికి మూకుమ్మడిగా అనేక డొమైన్లను రిజిస్టర్ చేయడం నేరం కాదు. అలాగే తన డొమైన్ మరొకరికి అమ్మే వ్యాపారమూ చట్టబద్ధమే. 'ebay' వంటి ఆక్షన్ సైట్లు నిత్యం కొన్ని డొమైన్లను వేలంపాట పెడుతూనే వుంటాయి. కాబట్టి ప్రతి డొమైన్ సెల్లర్‌నూ సైబర్ స్క్వాటర్ అనలేము. రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు, కొనుగోళ్ళ వెనుక దురుద్దేశం వుందని రుజువైనప్పుడే అది నేరంగా పరిగణించబడుతుంది. దానినే 'సైబర్ స్క్వాటింగ్' అనాలి.

తాము రిజిస్టర్ చేసుకోవాలనుకున్న పేరు 'సైబర్ స్క్వాటింగ్'కు గురైందని గుర్తించిన సంస్థలకు మిగిలింది రెండే పరిష్కారాలు. whois.com వంటి సైట్ల ద్వారా ఏ వెబ్‌సైట్ ఎవరి పేరుమీద రిజిస్టర్ అయిందో తెలుసుకోవడం, అలా రిజిస్టర్ చేసిన వ్యక్తులపై దావావేసి, గెలుపొందడం ద్వారా తమ పేరును సొంతం చేసుకోవడం లేదా వారితో రాజీపడి వారు కోరిన ధర చెల్లించి ఆ పేరును కొనుక్కోవడం. అయితే ఎక్కువ మంది కోర్టులు దావాలూ అంటూ తిరగడం, సమయం వృధా అనుకుంటే సంబంధిత డొమైన్లు రిజిస్టర్ చేసుకున్నవారితో బేరమాడి తమ పేరుతోవున్న డొమైన్లను దక్కించుకునేందుకే పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు ఆసక్తి చూపుతాయి. 'సైబర్ స్క్వాటింగ్' అనే పదం దీనికి సరిపోకపోయినా మన రాష్ట్రంలోనూ ఇటీవల రెండు రాజకీయ పార్టీలు తాము నిర్ణయించుకున్న పేరుతో అప్పటికే వేరేవారు ఎన్నికల కమిషన్ వద్ద రిజిస్టర్ చేసుకోవడం, తదనంతరం బేరసారాలు, చివరకు అసలు వారి పేరున రిజిస్ట్రేషన్ మార్పించుకున్న విషయం మీడియాలో జరిగిన చర్చ అందరికీ తెలిసిందే.

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే- ఏ సంస్థ అయినా తమ బ్రాండ్ నేమ్‌ని మరొకరు స్క్వాట్ చేసారని భావించినప్పుడు సైబర్ చట్టాలను దృష్టిలో పెట్టుకుని ఏం చేయాలనేది నిర్ణయించుకోవాలి. లేకపోతే తమ బ్రాండ్‌నేమ్ రిజిస్ట్రేషన్‌ను దక్కించుకోవడం సాధ్యంకాదు.

ఏదైనా ఒక పెద్ద సంస్థ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించినంత మాత్రాన ఆ సంస్థ పేరు ప్రతిష్టలనుంచి లబ్ది పొందాలనే ఆలోచన చేసాడనలేం. అయితే సైబర్ చట్టాల ప్రకారం 'ఇతరుల ట్రేడ్‌మార్క్‌లు, బ్రాండ్‌నేమ్‌ల పేరు ప్రతిష్టలను ఉపయోగించుకునే దురుద్దేశంతో ఒక సైట్‌ను రిజిస్టర్ చేయడం, అమ్మడం, ఉపయోగించడం 'సైబర్ స్క్వాటింగ్' అవుతుంది. అయితే సదరు వ్యక్తి దీన్ని దురుద్దేశపూరితంగానే చేశాడనే విషయాన్ని నిరూపించగలగాలి.



అదేవిధంగా రిజిస్టర్ అయిన సైట్ పేరు, తమ సంస్థ పేరు ఒక్కటేనని లేదా దానికి చాలా దగ్గర పోలికలున్నాయని నిరూపించడం కూడా అవసరం. ఉదాహరణకు www.yahoo.comకి దగ్గర పోలికతో www.yaho.com అనే పేరుతో రిజిస్టర్ చేసినా అది 'సైబర్ స్క్వాటింగ్ కిందకే వస్తుంది. అంటే ఆ సంస్థ గుడ్‌విల్‌ని సొమ్ముచేసుకునే దురుద్దేశం వారికి వుందని అనుమానించాల్సి వుంటుంది. అయితే ఇటువంటివి నిరూపించడం కూడా కష్టంతో కూడుకున్నదే.

ఇంతకష్టపడి తమ ట్రేడ్‌మార్క్‌లు, బ్రాండ్‌నేమ్‌లను నిరూపించుకునే బదులు సైబర్ స్క్వాడర్లు కోరుకునే డబ్బు ఇచ్చేసి తమ వెబ్‌సైట్ పేరును సొంతం చేసుకోవడం ఒకటైతే..., పట్టుబట్టి వారిపై కేసులు పెట్టి అన్ని ఆధారాలతో నిరూపించి తమ పేరును సొంతం చేసుకోవడంతోపాటు నష్టపరిహారం సాధించుకునే అవకాశం కూడా లేకపోలేదు.

టైపో స్క్వాటింగ్

నాణేనికి మరోవైపులా సైబర్ స్క్వాటింగ్‌కి మరో కోణం టైపో స్క్వాటింగ్. స్పెల్లింగ్ పొరబాటు, టైపింగ్ తడబాట్లు వంటి లోపాలను ఆధారం చేసుకొని దారిమళ్ళించే ప్రక్రియనే టైపో స్క్వాటింగ్ అంటారు. ఉదాహరణకు- prajasakti.com ను prajasakthi.com, prajaasakti.com, prajashakti.com, prajashakthi.com ఇలా ప్రజాశక్తి డాట్‌కామ్‌ను ఇన్ని రకాలుగా ఎలా రాయవచ్చో, అదేవిధంగా అక్షరం మార్పుతో ఎన్ని రకాల పొరబాట్లు చేసే అవకాశం వుందో అన్నిటినీ ముందుగానే ఊహించి ఆ పేర్లన్నిటితో రిజిస్టర్ చేసి యూజర్లను దారి మళ్ళించడమే వీరి లక్ష్యం. ఇదే తరహాలో పాపులర్ డొమైన్స్ అన్నిటినీ రిజిస్టర్ చేస్తారు.

కొందరు ప్రముఖ కంపెనీల లోగోలు, డిజైన్లను కాపీచేసి తాము కరెక్ట్ సైట్‌కే వచ్చామనే భ్రమ కల్పిస్తారు. తద్వారా యాడ్ రెవెన్యూ సంపాదిస్తారు. మరికొందరు అశ్లీలసైట్లకు, స్పాన్సర్డ్ లింక్స్ వున్న సైట్లకు వినియోగదార్లు రీడైరెక్ట్ అయ్యేలా సదరు సంస్థలో ఒప్పందాలు కుదుర్చుకుని లాభాలు పొందుతారు. అంతేకాకుండా మాల్వేర్, ఫీమ్‌వేర్, స్కమ్‌వేర్, స్పైవేర్ వంటి సాఫ్ట్‌వేర్ల సాయంతో యూజర్ల వివరాలు సేకరించి ఆ డేటాబేస్ అమ్మకాలతో లాభాలు గడిస్తారు. యూజర్లు టైప్‌చేసిన వెబ్‌సైట్ అడ్రస్‌లను రికార్డు చేసే సాఫ్ట్‌వేర్లు కూడా వున్నాయి. ఎక్కువమంది ఏ పేర్లతో సైట్ అడ్రస్‌లు టైప్ చేస్తుంటారో గుర్తించి, వాటిలో రిజిస్టర్ కాని సైట్లను రిజిస్టర్ చేసి పెట్టుకుంటారు. ఇవన్నీ కూడా సైబర్‌స్క్వాటింగ్‌లో భాగమే.

టెక్నాలజీ, సాంకేతిక చైతన్యం పెరిగిన ఈ రోజులలో కూడా ఈ తరహా సైబర్ మోసాలు జరుగుతూనే వున్నాయి. వినియోగదారులను పక్కదారి పట్టించడం, వారికి తెలియకుండానే వారి ద్వారా డబ్బు సంపాదించడం దీని లక్ష్యం. ★

హ్హా... హ్హా...

ధన్యవాదాలు



రామయ్య : భగవంతుడా! నా గాడిద తప్పిపోయినందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను. నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీడంలేదు.

సోమయ్య : గాడిద తప్పిపోయినందుకు బాధ పడాలి కానీ అలా సంతోషిస్తున్నావెందుకు?

రామయ్య : ఎందుకంటే నేను దాని మీద కూర్చుని ప్రయాణం చేసేప్పుడు తప్పిపోతే...నేనూ తప్పిపోయేవాణ్ణి కదా. అందుకు!

తడి

పేషెంట్: డాక్టర్! నేను స్నానానికెళ్లినప్పుడు తడుస్తున్నాను. అలా కాకుండా ఏదైనా ఉపాయం వుందా?

డాక్టర్: ఓకే..ఓకే...ఈసారి స్నానానికి వెళ్లినప్పుడు కుళాయి తిప్పకండి.

సిన్మా పిచ్చి

కష్టమర్ : నిన్న నా కళ్లజోడు ఈ టేబుల్ మీద మర్చిపోయాను. చూశావా?

సప్లయర్ : చూసి తీశాను సార్. రాత్రి సిన్మా టికెట్ కోసం పాన్‌షాప్‌వాలా దగ్గర తాకట్టు పెట్టా.

నిలబడ్డావేం?

టీచర్: ఏంట్రా బంటీ? ఎందుకు నేలమీద నిలబడ్డావు?

బంటీ: మీరే కదా టీచర్. టేబుల్స్ లేకుండా లెక్క చేయమన్నారు.

జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

సినిమా కబుర్లు



నిడమర్తి సూరయ్య

తెలుగు గడ్డపై నిర్మితమైన తొలి తెలుగు సినిమా ఏది? ఆ నిర్మాణం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగింది? తెలుగునాట సినీ రంగం వందల కోట్ల రూపాయల పరిశ్రమగా వెలుగొందుతున్న ప్రస్తుత సమయంలో చరిత్ర మీద ఆసక్తి ఉన్న ఎవరికైనా ఇలాంటి సందేహాలు రావడంలో తప్పు లేదు. అయితే, చూడడానికి సాదాసీదాగా కనిపించే ఈ ప్రశ్నలకు జవాబులు మాత్రం కొంత లోతైన పరిశీలన తరువాత మాత్రమే తెలుస్తాయి. ఇప్పటికి సరిగ్గా 75 ఏళ్ళ క్రితం తెలుగు గడ్డపై జరిగిన తొలి తెలుగు స్టూడియో, టాకీల నిర్మాణం కథాకమామిషే ఈ వ్యాసం.



ఎన్.ఎస్.మూర్తి

తెలుగు గడ్డపై తొలి స్టూడియో... తొలి టాకీ

మూకీల రోజుల్లో ఏ ప్రాంతం వారు ఎక్కడ సినిమాలు తీసినా అది అందరి సినిమా. ఎందుకంటే భాషతో పని లేదు కాబట్టి. కానీ, తెర మీది బొమ్మలు మాటలు నేర్చిన తరువాత మాత్రం పరిస్థితి వేరు. ఒక్కసారిగా సినిమా ప్రాంతీయ, భాషా సరిహద్దుల్లో బందీ అయింది. 1931లో 'ఆలమ్ ఆరా'తో మొదలైన భారతీయ టాకీ చిత్ర యుగంలో 'భక్త ప్రహ్లద'తో తెర మీది బొమ్మలు తెలుగు మాట్లాడడం మొదలుపెట్టాయి. అయితే, తొలి రోజుల్లో ఈ తెలుగు టాకీలన్నీ అప్పట్లో సాంకేతికంగా సినిమాకు పట్టుగొమ్మలైన బొంబాయి, కలకత్తా, కొల్హాపూర్ లాంటి ఉత్తరాది ప్రాంతాల్లోని స్టూడియోల్లో చిత్రీకరణ జరుపుకొనేవి. శ్రమ, ఖర్చుతో కూడుకున్న ఈ అవస్థల నుంచి తప్పించడానికి అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి రాజధాని అయిన మద్రాసులో స్టూడియోలు రావడం 1934లో మొదలైంది. తమిళుల తొలి స్టూడియో శ్రీనివాస సినీటోన్ తరువాత మద్రాసులో ఏర్పాటైన రెండో స్టూడియో - వేల్ పిక్చర్స్ స్టూడియో. తెలుగు వారైన పి.వి. దాసు తదితరులు, తమిళులతో కలసి పెట్టుబడులు పెట్టి, దాన్ని నెలకొల్పారు. అలా మద్రాసులో తెలుగు వారి భాగస్వామ్యంతో ఏర్పాటైన వేల్ పిక్చర్స్ సంస్థ తొలి ప్రయత్నంగా తెలుగు టాకీ 'సీతా కల్యాణము' (1934) నిర్మించింది.

రాజమండ్రిలో మన తొలి స్టూడియో

అయితే, పూర్తిగా తెలుగు వారి యాజమాన్యంలో, వారి సొంత పెట్టుబడితో, ఆంధ్రదేశం నడిబొడ్డున స్టూడియో ఆవిర్భవించడానికి మరో రెండేళ్ళు పట్టింది. సినిమా పట్ల ఉత్సాహం ఉన్న కొందరు అంతకు కొద్ది నెలల ముందు బెజవాడలో ఓ స్టూడియో నిర్మించాలని యోచించారు. అయితే, ఎందుకనో కొద్ది రోజుల్లోనే ఆ ఆలోచన అటకెక్కింది. ఆ పరిస్థితుల్లో 1936 ప్రాంతంలో 'శ్రీదుర్గా సినీటోన్ కంపెనీ' పేరిట స్టూడియో వెలిసింది. గోదావరీ తీరంలోని రాజమండ్రిలో ఆ స్టూడియో ఏర్పాటైంది. తెలుగు గడ్డపై నెలకొన్న తొట్టతొలి సినిమా స్టూడియో అదే! ఇక, అక్కడ నిర్మాణమైన తొలి చిత్రం - 'సంపూర్ణ రామాయణము' (1936). ఆంధ్రదేశంలో తయారైన తొలి టాకీ అదే! నిడమర్తి వారి కుటుంబమే అటు స్టూడియోనూ, ఇటు ఈ సినిమానూ - రెంటినీ నిర్మించింది. ఈ నిర్మాణాల వెనుక పెద్ద కథే ఉంది. అన్నదమ్ములైన నిడమర్తి కృష్ణమూర్తి, సూరయ్య తదితరుల తండ్రి గారి పేరు - నిడమర్తి జలదుర్గా ప్రసాదరాయడు. ఆయనను అందరూ 'దుర్గయ్య' అని పిలిచేవారు. ఆయన పూర్వీకులది భీమవరం తాలూకాలోని కొమ్మెర. రాజమండ్రి మునిసిపల్ సంఘ సభ్యులైన దుర్గయ్య తొమ్మిదేళ్ళ పాటు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్లీడరుగా బోలెడంత ప్రాక్టీస్ ఉన్న ఆయన లక్షల్లో సంపాదించారు. తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఎంతో అభిరుచి ఉన్న దుర్గయ్య గారు ఆ రోజుల్లోనే పద్యాలు అల్లుతుండేవారు. రాజమండ్రిలోని ఇన్నీసుపేటలో నిడమర్తి వారి భవనం ఉండేది. దుర్గయ్య గారికి ఆరుగురు కుమారులు. మూడో అబ్బాయి నిడమర్తి వి. కృష్ణమూర్తి, నాలుగో అబ్బాయి సూరయ్య - ఇద్దరూ సినిమాల్లోకి దిగి, ఆనుపానులు తెలుసుకున్నారు. నిడమర్తి వారి కుటుంబం 1924 ప్రాంతంలో రాజమండ్రిలో 'శ్రీకృష్ణా పిక్చర్ ప్యాలెస్' అనే సినిమా హాలు కట్టింది. అప్పుడు మొదలైన ఆ హాలు 1983లో 'శ్రీసాయికృష్ణా ఏ.సి' అని పేరు మార్చుకొని ఇప్పటికీ నడుస్తోంది.

తెలుగు గడ్డపై తొలి టాకీ

నిడమర్తి సోదరులు 1930ల మధ్యలో చిత్ర నిర్మాణం చేపట్టాలని భావించారు. అందుకు తగిన స్టూడియోను కూడా ఉన్న ఊళ్ళోనే, తామే ఏర్పాటు చేసుకోవాలని భావించారు. రాజమండ్రిలోని ఆల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలో దాదాపు 14 ఎకరాల స్థలంలో ఓ పాత డచ్ బంగళా దుర్గయ్య గారికి ఉండేది. దానిలోనే స్టూడియో పెట్టారు. పురప్రముఖుడూ, స్వయానా తండ్రీ అయిన దుర్గయ్య పేరు కూడా వచ్చేలా స్టూడియోకు 'శ్రీదుర్గా సినీటోన్ కంపెనీ' అని పేరు పెట్టారు. అలా తెలుగునేలపై తొలి స్టూడియో వెలసింది. ఆ సంస్థకు యజమానులైన నిడమర్తి వి. కృష్ణమూర్తి, ఆయన సోదరులు తమ తొలి ప్రయత్నంగా "తెలుగు మాట్లాడు ఫిల్మ్" 'సంపూర్ణ రామాయణము' నిర్మించారు. అదే తెలుగు గడ్డపై నిర్మాణమైన తొలి చిత్రంగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ చిత్రాన్ని వారు తమ సొంత స్టూడియోలో నిర్మించడమే కాక, "న్యూ ఫిడెలిటోన్ సిస్టమ్‌లో రికార్డు" చేశారు. నిడమర్తి సూరయ్య ప్రొడక్షన్ మేనేజర్‌గా వ్యవహరించగా, నిడమర్తి వి. కృష్ణమూర్తి బిజినెస్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ చిత్రానికి ఐ. నాగభూషణరావు, ఎన్.బి. నారాయణలు దర్శకత్వం వహించారు. వారికి సహాయకుడిగా డి. నరసింహారావు పనిచేశారు. దుర్గయ్య గారి మనుమడూ, సూరయ్య గారి పెద్ద భార్య సత్యవతికి ఏకైక సంతానమూ అయిన నిడమర్తి సత్యనారాయణ మూర్తికి కూడా మొదటి నుంచి సినీ రంగం మీద ఆసక్తి ఉండేది. 1930లలోనే ఆయన బొంబాయి వెళ్ళి, సౌండ్ రికార్డింగ్, రేడియో ఇంజనీరింగ్ చదివి. రాజమండ్రికి తిరిగొచ్చారు. ఆ యౌవన కాలంలోనే ఆయన తన తండ్రి సూరయ్య తదితరులతో కలసి తమ స్టూడియో వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొన్నారు. "మా నాన్నగారైన సూరయ్య గారికి ఇవటూరి నాగభూషణరావు మంచి మిత్రులు. నిజానికి, ఆయన సివిల్ ఇంజనీర్. ఆయనతోనే 'సంపూర్ణ రామాయణము' (1936) చిత్ర దర్శకత్వం చేయించారు" అని ఎన్.ఎస్. మూర్తిగా సినీ లోకంలో పరిచితులైన నిడమర్తి సత్యనారాయణ మూర్తి తన చివరి రోజుల్లో ఈ వ్యాసకర్తకు ఇచ్చిన భేటీలో చెప్పారు.

ఆ రోజుల్లోనే ఆధునిక స్టూడియో

తెలుగు దేశంలో ఆరంభమైన ఆ తొలి స్టూడియోలో అప్పటికి అత్యాధునికమైన సాంకేతిక సామగ్రి మొత్తాన్నీ తెప్పించారు. "అప్పట్లో మద్రాసులో కూడా సరైన సినీ సాంకేతిక సామగ్రి ఉండేది కాదు. బొంబాయి నుంచి తెప్పించాం. బొంబాయి నుంచి తెప్పించిన వ్యాన్‌లోనే సౌండ్ రికార్డింగ్ ఎక్విప్‌మెంట్ అంతా ఉండేది. షూటింగ్ జరిగే ప్రాంతంలోనే ఆ వ్యాన్ ఉంచి, శబ్దం రికార్డు చేసేవాళ్ళం. మా దగ్గర 'బెల్ అండ్ హోవెల్' కెమేరా ఒకటి ఉండేది. శబ్దం, దృశ్యం - రెండూ నడిచేలా, మూవీయోలా ఎడిటింగ్ సామగ్రి కూడా ఉండేది" అని ఎన్.ఎస్. మూర్తి ఆ చిన్నప్పటి సంగతులను గుర్తు చేసుకున్నారు. పైగా, ఆ రోజుల్లో షూటింగ్ చేసిన ఫిల్మును రాజమండ్రిలోనే స్టూడియోలో డెవలప్ చేసి, ప్రాసెసింగ్ చేసేవారంటే

ఆశ్చర్యం కలుగుతుంది. "పెద్ద డ్రమ్ములు రెండు ఉండేవి. డెవలప్ చేసిన ఫిల్మును అంతా ఆ డ్రమ్ముకు చుట్టి, ఆరబెట్టేవాళ్ళం. అలా మా స్టూడియో అన్ని వసతులతో సర్వసమగ్రంగా ఉండేది" అని ఆయన నవ్వేశారు. "అప్పట్లో షూటింగ్‌కు తగిన వెలుతురు కోసం, షూటింగ్ జరిగే స్థలంలో పై కప్పు లేకుండా చూసేవాళ్ళం. తెల్లటి వస్త్రాలు ఆ పై కప్పు దగ్గర కట్టేవాళ్ళం. ఆ వస్త్రాల మీదుగా వచ్చే సూర్యకాంతి షూటింగ్‌కు ఉపకరించేది" అని ఎన్.ఎస్. మూర్తి చెప్పుకొచ్చారు. 'సంపూర్ణ రామాయణము' నిర్మాణం కోసం సాంకేతిక నిపుణులందరినీ బొంబాయి నుంచి రాజమండ్రికి రప్పించి, అక్కడే బస ఏర్పాట్లు కల్పించారు. "శబ్దగ్రహణం మీద ఆసక్తి ఉన్న నేను ఆ సమయంలో సౌండ్ ఇంజనీర్ పి.ఎల్. కపూర్‌తో కలసి బాగా తిరిగేవాణ్ణి. చిత్ర నిర్మాణంలోని సాంకేతిక విశేషాలెన్నో తెలుసుకొనేవాణ్ణి" అని మూర్తి చెప్పారు. "ఆ సినిమాను దాదాపు 2 నెలల కాలవ్యవధిలో ఏకబిగిన చిత్రీకరించాం. సినిమా తుది నిడివి 15 వేల అడుగుల పై మాటే! ఆ రోజుల్లోనే ఆ చిత్ర నిర్మాణానికి రూ. 60 వేలు ఖర్చయింది. కానీ, అనుభవ రాహిత్యం వల్ల ఆ సినిమాను సరైన రీతిలో తీయలేకపోయాం, సక్రమంగా వ్యాపారం చేయలేకపోయాం" అని ఆయన వివరించారు.



రాజమండ్రిలో మన తొలి స్టూడియో

షూటింగ్‌లో తమాషాలు

శ్రీరామ జననం మొదలు రావణ సంహారానంతరం సాగే శ్రీరామ పట్టాభిషేకం వరకు మొత్తం రామాయణ కథనంతా ఈ చిత్రంలో తెరకెక్కించారు. దాంతో, నాటకాల్లో ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు లాగా ఈ చిత్రంలో కథను అనుసరించి వివిధ వయస్సుల్లో వచ్చే రాముడి పాత్రను ముగ్గురు, సీత పాత్రను ఇద్దరు పోషించారు. సీత పాత్రలో పుష్పవల్లి తాయారమ్మ (హిందీలో పేరు తెచ్చుకున్న నటి రేఖ తల్లి), స. రమణీమణి కనిపించారు. అలాగే, ఈ చిత్రంలో ముగ్గురు లక్ష్మణులు, ముగ్గురు భరతులు, ముగ్గురు శత్రుఘ్నులు కనిపిస్తారు. దశరథుడిగా ముక్కవల్లి సుబ్బారావు నటిస్తే, ఆయన కుమారుడు నారాయణరావు బాల రాముడిగా కనిపించారు. శివధనుర్భంగ సన్నివేశంలో కల్యాణ సీతగా పుష్పవల్లి నటించారు. ఆమె వేషం మూడు రోజుల్లోనే పూర్తయిందనీ, ఆమెకు మూడొందల రూపాయలు పారితోషికంగా ఇచ్చారనీ చెబుతారు. ఈ చిత్రంలోని దృశ్యాల గురించి, చిత్రీకరణ గురించి ఎన్నో గమ్మత్తులు ఆ తరం వాళ్ళు ఇప్పటికీ చెబుతుంటారు. ఈ చిత్రంలో బాల రాముడి పాత్ర ఓ పాడాల్సి వచ్చిందట! అప్పట్లో ఎవరి పాట, పద్యం వారే పాడుకొనేవారు. కానీ, ఆ పాత్ర వేస్తున్న చిన్నారికి ఎంత ప్రయత్నించినా, ఆ పద్యం కంఠతా రాలేదు. దాంతో, దర్శకుడికి ఓ ఆలోచన వచ్చింది. ఆ పద్యాన్ని పెద్ద పెద్ద అక్షరాల్లో పలక మీద రాసి, కింద గడ్డిలో పెట్టారు. బాల రాముడి వేషం వేసిన చిన్నారి కిందనున్న ఆ పలకనే చూస్తూ, తలెత్తకుండా ఆ పద్యం చెప్పాడట! అలాగే, రామాయణ కథలో వచ్చే యుద్ధ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నప్పుడు ఈ చిత్ర నిర్మాణ బృందానికి తగినంత మంది జూనియర్ ఆర్టిస్టులు దొరకలేదు. దాంతో, అప్పట్లో గోదావరి కాలువ తవ్వడానికి వచ్చిన కూలీలతో వానరుల వేషాలు వేయించారు. అలా వేషం కట్టినందుకు గాను మనిషికి రోజుకు కుంచెడు బియ్యం, నాలుగు అణాలు పారితోషికం ఇచ్చారని చెబుతారు.

ప్రచారం పెద్దది, ఫలితం చిన్నది!

రాజమండ్రిలోనే చిత్ర నిర్మాణం జరుపుకొన్న 'సంపూర్ణ రామాయణము' సెన్సార్ నిమిత్తం మద్రాసు సెన్సార్ బోర్డుకు వచ్చింది. చిత్రం మొత్తం నిడివి 18 వేల అడుగులు. ప్రదర్శనకు 3 గంటల 20 నిమిషాలు పట్టేది. ఈ చిత్రం 1936 జూన్ 6న సెన్సారైంది. అయితే, విడుదల తేదీ కచ్చితంగా ఏదన్నది మాత్రం తెలియడం లేదు. అప్పటి నిజామ్ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో మాత్రం 1936 ఆగస్టు 8వ తేదీ శనివారం నాడు ఈ 'సంపూర్ణ రామాయణము' చిత్రం తొలిసారిగా విడుదలైంది. సికింద్రాబాద్‌లోని రీగల్ టాకీసు (అంతకు ముందు దాని పేరు 'రామగోపాల థియేటర్') ఈ చిత్ర ప్రదర్శనలకు వేదికగా నిలిచింది.

"శ్రీదుర్గా సినీటోన్ కంపెనీ (రాజమండ్రి) వారి స్వంత స్టూడియోలో తయారు చేయబడిన చిత్రము" అంటూ "మహత్తర పౌరాణిక గాథ"గా 'సంపూర్ణ రామాయణము' ప్రచారం సాగింది. గమ్మత్తేమిటంటే, విద్యావంతులైన వారిని ఈ సినిమాలో నటులుగా వినియోగించిన విషయాన్ని కూడా గొప్పగా చెప్పుకున్నారు. కానీ, అవేవీ అక్కరకు వచ్చినట్లు లేవు. "ఆంధ్ర కళాకోవిదుల వైదుష్యము, విద్యాధికులైన నటీనటుల సమ్మేళనము, ఆంధ్ర స్వానుదారుల పెట్టుబడి, విస్పష్ట శబ్దగ్రహణము, తాంత్రిక ఛాయాచిత్ర గ్రహణము, ఉపజ్ఞా సహిత సన్నివేశములు కలిగిన చిత్రములు" – ఇవన్నీ ఉన్నాయని పదే పదే చెప్పుకున్నప్పటికీ ఈ "మహత్తర పౌరాణిక చిత్రము"ను ప్రేక్షకులు ఆదరించలేదు.

పురిటిలోనే సంధి

నిజానికి, నిడమర్తి సూరయ్య, కృష్ణమూర్తి సోదరులు తమ శ్రీదుర్గా సినీటోన్ కంపెనీలో తదుపరి ప్రయత్నాలుగా 'పాంచాలీ కల్యాణము', 'సారంగధర' చిత్రాలను కూడా నిర్మించాలని భావించారు. ఆ మేరకు 'సంపూర్ణ రామాయణము' ప్రచారంలో ప్రకటనలు కూడా వేశారు. కానీ, తొలి చిత్రమే విఫలం కావడంతో తరువాతి ప్రయత్నాలకు పురిటిలోనే సంధి కొట్టింది. "స్వతంత్ర చిత్ర నిర్మాతలకు అన్ని సదుపాయాలతో స్టూడియోను అద్దెకు ఇస్తా"మనే ప్రకటన కూడా చేశారు. చిత్ర పరాజయం, ధన నష్టంతో ఆ స్టూడియో ఆట్టే కాలం యజమానుల చేతిలో లేదు. దర్శకుడు సి. పుల్లయ్య స్టూడియోను అద్దెకు తీసుకొని, 'శ్రీసత్య–నారాయణ' (1938) తదితర చిత్రాలు నిర్మించారు. ఆ పైన 'మోహినీ భస్మాసుర' (1938) కూడా నిర్మించారు. కానీ, సి. పుల్లయ్య చేతుల్లోనూ ఆ స్టూడియో ఎంతో కాలం సమర్థంగా నడవలేదు. చివరకు నిడమర్తి సోదరులు స్టూడియోను శాశ్వతంగా మూసివేసి, "అందులోని సాంకేతిక సామగ్రిని విక్రయించే"యాల్సి వచ్చింది.

ఆ తరువాత తెలుగు గడ్డపై రెండో స్టూడియోగా విశాఖపట్నంలో 'ఆంధ్రా సినీటోన్' స్టూడియో 1937లో అవతరించింది. 'భక్త జయదేవ' (1938) లాంటి చిత్రాలను ఆ స్టూడియో యజమానులు నిర్మించారు. 'పాశుపతాస్త్రం' (1939) లాంటి చిత్రాలు అక్కడే తయారయ్యాయి. కానీ, ఆ స్టూడియో కూడా అనతికాలంలోనే మూతబడింది. ఆ తరువాత ఏర్పడ్డ తెలుగు వారి స్టూడియోలన్నీ మద్రాసుకే ప్రధానంగా పరిమితమయ్యాయి. "మా నాన్న గారు ఉండగానే, రాజమండ్రిలోని మా స్టూడియో భవనాన్ని సత్యసాయిబాబా గారికి ఇచ్చేశాం" అని నిడమర్తి సూరయ్య కుమారుడు ఎన్.ఎస్. మూర్తి చెప్పారు.

ఆ తొలి 'సంపూర్ణ రామాయణము' నెగటివ్ చాలా కాలం నిడమర్తి సోదరుల దగ్గర షెడ్డులో పడి ఉండేది. ఆ తరువాత దాదాపు మూడున్నర దశాబ్దాలకు ఎన్.ఎస్. మూర్తి తన తండ్రి తీసిన రామాయణ కథనే మళ్ళీ 'సంపూర్ణ రామాయణం' (1972)గా తెరకెక్కించారు. శోభన్‌బాబు హీరోగా బాపు – రమణలు ఆ చిత్రం రూపొందించారు. ఆ చిత్రం తీస్తున్నప్పుడు, "నిడమర్తి వారి అనుమతితో ఆ ప్రింట్‌ను మద్రాసుకు తీసుకొచ్చి, శుభ్రం చేయించి, పూనాలోని 'నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా'కు అందజేశా"రు రచయిత ముళ్ళపూడి వెంకట రమణ. ఇప్పటికీ ఆ ప్రింటు పూనాలోని ఆర్కైవ్స్‌లో ఉంది. అతి పాత చిత్రాలన్నిటినీ డిజిటలైజ్ చేసే ప్రక్రియను ఆర్కైవ్స్ చేపట్టినప్పటికీ, తెలుగు సినిమాల గురించి, అందులోనూ ఈ నిర్ణీత సినిమా విశిష్టత గురించి చెప్పేవాళ్ళూ, వినే నాథులూ లేకపోవడంతో ఈ సినిమా ఆ పాత ప్రింటు రూపంలోనే బిక్కుబిక్కుమంటోంది. మరి, ఇప్పటికైనా మన సినిమా పెద్దలు, చలనచిత్ర అభివృద్ధి సంస్థల నేతలూ ఈ అంశంపై దృష్టి పెడతారా? తెలుగు గడ్డపై రూపొందిన తొలి టాకీని భావి తరాల కోసం డిజిటల్ రూపంలో పరిరక్షింపజేస్తారా? తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'ను మచ్చుకో ఫిల్ము ముక్కయినా లేకుండా పోగొట్టుకున్న మనవాళ్ళు తెలుగు నాట రూపొందిన ఈ తొలి చిత్రాన్నైనా కాపాడుకోకపోతే, అక్షరాలా చరిత్ర హీనులమే అవుతాం!

- రెంటాల జూనియర్

చిన్నకథ

ఆమె

ఆమె బిలంలోంచి బయటికి వచ్చింది. ఇది నిత్యం జరిగేదే. ఆమె ఓ పాత బండిలో నివాసముంటుంది. అక్కడ్నుండి చక్కెర కార్ఖానా దగ్గరున్న పచారీకొట్టు వరకు అమిత వేగంతో పరుగెత్తుకుంటూ వచ్చి ఆ బిలంలోంచి దూరిపోవడం ఆమె అలవాటు.

'ఆమె' అంటే ఒక పెద్ద ఎలుక. అడవి పిల్లిలా కనిపించే కొవ్వెక్కిన ఆ ఎలుకకు తీక్షణమైన కళ్లు, కొరడాలా ఉన్న పొడవైన సన్నటి కొనదేరిన తోక...

ఆమె అక్కడే పుట్టింది. అక్కడి మూలలన్నీ ఆమెకు బాగా తెలుసు.

ఆ రాత్రి ఆమె పొట్టలోని పిల్లలు దొర్లసాగాయి. చిక్కుడు గింజల్ని కొరకడానికి ముందే, ఉప్పు పట్టించిన పంది మాంసాన్ని రుచి చూడడానికి ముందే, అక్కడ రాశిపోసిన ప్రతి వస్తువు వైపు దృష్టి సారించేలోపు, తన పొట్ట పగిలిపోతుందేమో అని ఆమెకు అనిపించింది. అప్పుడు అమె పిల్లలు ఒకదాని తర్వాత ఒకటి బయటికి రాసాగాయి...

చివర్లో వున్న పిండి సంచుల దగ్గర ఆమె గూడు కట్టుకుంది. అక్కడ తననెవరూ ఇబ్బంది పెట్టరని ఆమె భావించింది.

మరుసటి రోజు ఉదయం తెల్లవారినా ఆమె ఇంకా పచారీకొట్లోనే ఉంది. పగటిపూట ఇలా అందులో ఉండడం ఇదే మొదటిసారి. అందువల్ల చాలా జాగ్రత్తగా ఉంది. అయినా గుండె దడదడలాడుతోంది. మనసు కలవరపడుతోంది.

పచారీకొట్లో అప్పుడే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయపు చప్పుళ్ళు అక్కడినుండి వినిపిస్తున్నాయి. ఏ చిన్న శబ్దం చెవిన పడ్డా ఆమె ఒణికిపోయి తన పిల్లల చిట్టి దేహాలపై వాలేది. పక్కన నేలమీద పడుతున్న బలమైన అడుగులు ఆమెను ఉరుముల్లా భయపెట్టేవి.

తలుపు తాళం తీసినప్పుడు ఆమె కంగారుగా అటూఇటూ పరుగులు పెట్టసాగింది. తాను నిర్గమించే మామూలు బిలం దగ్గరికి వచ్చింది. అయితే ఈ సారి తాను బయటికి వెళ్లలేననిపించింది. గజగజవణుకుతూ గూటికి తిరిగొచ్చి సొగసైన మూతిని పైకెత్తి చూసింది. మిలమిలా మెరుస్తున్న ఆమె చిట్టికళ్లు భయంతో చూశాయి. భారమైన, బురద అంటిన బూట్లు ధరించిన పెద్దసైజు పాదాలు రెండు లోపలికి ప్రవేశించాయి.

రాసులు పోసిన గోనెమూటల వెనుకనుండి బోడిగా ఉన్న రెండు మోచేతులను ఆమె కళ్లు చూశాయి. ఒక చేయి పెద్ద గరిటెను పట్టుకుని ఉంది. పీపా నుండి తీసిన కొవ్వు అందులోంచి బొట్లుబొట్లుగా కారుతోంది.

నల్లటి కాగితంపై కొవ్వు మృదువుగా పడింది. అటు తర్వాత ఆ చేతులు ఆ కొవ్వును తక్కెడ పళ్లెంలో పెట్టాయి. ఒక వేలు జాగ్రత్తగా దాన్ని జరిపింది.

"నీకెంత కావాలి?"

"అరపౌండు! నీకు దండం పెడతా. సరిగ్గా కొలిచి ఇవ్వు" అంది సేటుతో.

ఆమెది పచ్చని ముఖం, కళ్ల చుట్టూ నలుపు వలయాలు. చక్కెర కార్ఖానా జనం ముఖాలన్నీ అలాగే ఉంటాయి. ఇది ఎలుకకు తెలుసు. తూకంలో మోసం జరగడాన్ని పట్టుకోవాలన్నట్లు ఆ స్త్రీ చూపులు తక్కెడనే అంటిపెట్టుకుని ఉన్నాయి. తూకం వేస్తున్న మనిషి ఆమె చూపుల్ని అడ్డుపెట్టలేదు. అందుకు కారణం గిరాకీలను దోపిడీ చేయగల తన యుక్తిని వారు ఊహించడం కూడా అసాధ్యమని అతనికి తెలుసు. కనురెప్పల చివరి నుండి చూస్తున్న ఎలుకకు ఆమె దీనరూపం కనిపించింది. ఆమె చంకలోని బిడ్డ ఎండిపోయిన పాలిండ్లను చీకుతోంది. ఆమె సంకోచంగా తడబడే కంఠంతో మరికొన్ని వస్తువులు కావాలని అడిగింది. ఆ వ్యక్తి వాటిని చిన్న చిన్న పొట్లాలలో కట్టి కౌంటర్ టేబుల్ మీద పెట్టాడు. తర్వాత పెన్సిల్‌ను ఒక చేత్తో ఆడిస్తూ ఇలా అన్నాడు : "నువ్వింకా ఒకటిన్నర 'పెసో' బాకీ ఉన్నావు. రాజోమ్ కోతల కాలానికి నీకు దమ్మిడీ కూడా దొరకదనిపిస్తుంది"

ఆమె కిందికి వంగింది. ఆమె భుజాలు ఇంకా కుంగిపోయాయి. ఎండిపోయిన గుండెల మధ్య ఆ పొట్లాలను పెట్టుకుంది. అతను తన నోటు పుస్తకంలో లెక్క రాసుకున్నాడు. చాలా లావైన నోటుబుక్కది.

ప్రతి రోజూ ఇలాగే జరిగేది. అవే కంఠాలు వినిపించేవి. అక్కడ అవే ముఖాలు కనిపించేవి. తాము ఇచ్చిన సొమ్ము విలువ కన్నా తక్కువ తూకాన్నే వారు తీసుకెళ్లేవారు. పందికొవ్వు ఉన్న పీపాలలోపల మరికొన్ని క్రిమి కీటకాలు మునిగాయి. వాటి శవాల్ని కెలుకుతూ గరిటె లోలోపలికి దిగేది. నల్ల రెక్కలను ఆ జీవులను లావు వేళ్లు విదిలించి వేరు చేసేవి. ఒక్క ముక్కనూ వ్యర్థం చేయకుండా ఎంతో జాగ్రత్తగా ఆ చేతులు వ్యాపారం చేసేవి.

సాయంత్రం అంగడికి తాళం వేశాక ఆ ఎలుక కళ్లబడిందంతా తినేది. దాని పిల్లలూ అలాగే తినేవి. అవి కూడా తల్లిలా జాగ్రత్తగా ఉన్నాయి. కొన్నాళ్లకు అవి బలిష్ఠంగా తయారయ్యాయి. చురుగ్గా మారాయి. ఆమె క్రమంగా వాటిపట్ల జాగ్రత్త వహించడం మానేసింది. ఇలాగే అవి కలిసికట్టుగా అంగడి మొత్తం ఎలాంటి భయం లేకుండా సంచరించేవి. తినుబండారాలపై తమ పంటి గుర్తులను, గోళ్ల గీతలను, తమ మృదువైన వెంట్రుకలను వదిలి వెళ్లేవి.

చీమలు, నానా రకాల పురుగులు అక్కడ నివసించేవి. ఆ వ్యక్తి వీటన్నింటి పట్ల ఔదార్యం చూపేవాడు. సానుభూతితో ప్రవర్తించేవాడు.

ఆ ఎలుక అటు తర్వాత చాలాసార్లు పిల్లల్ని కంది. రాత్రి అయితే చాలు అక్కడ చాలా గొడవగా ఉంటుంది. నిత్యం జరిగే విందువల్ల ప్రతి వస్తువులోనూ ఎలుకలు, బొద్దింకల వాసన. మూసిన అంగడిలోపల పులిసిన వాసనతో కూడిన వాతావరణంలో రెక్కలు అక్కడ్నుండి ఇక్కడకు ఎగిరేవి. మూతులు అక్కడ్నుండి ఇక్కడికి జరిగేవి. చీకటి మూలల్లో అవి ఒకదానికొకటి ఢీ కొట్టుకునేవి.

ఆ పీపాలో ఉన్న పంది కొవ్వు తెల్లటి పాకం, నల్లని చుక్కలతో పదే పదే రంగు కోల్పోయేది. అది మరుసటి రోజున చీమలకు రుచికరమైన ఆహారంగా మారిపోయేది.

ఈ వ్యాపారపు లెక్కపత్రాలను ఖాతాదారులెవరూ వుంచేవారు కాదు. ఉన్న లెక్కంతా ఆ పెద్ద పుస్తకంలోనే నిక్షిప్తమై ఉండేది.

అయితే ఆ ఎలుక పాలిట, ఆ అంగడి మనిషి పాలిట, అలాగే ఆ క్రిమికీటకాల పాలిట ఓ రోజు అన్నీ తలకిందులయ్యాయి.

అలా కావడానికి కారకులు ఆ మనుషులే! కళ్ల చుట్టూ నల్లటి వలయాలున్న ముఖాలతో పచారి సామాన్లు కొనడానికి వచ్చే ఆ జనం వల్లే అంతా తలకిందులయ్యింది. వాళ్లు మూకుమ్మడిగా వచ్చారు. ఐకమత్యంతో అంతా కలిసికట్టుగా వచ్చారు. వాళ్లలో మౌనరోషం బుసలు కొడుతోంది. వాళ్ల కళ్లు నిప్పులు కక్కుతున్నాయి. కుళ్లిన ప్రతి సంచీ, క్రిమికీటకాల ప్రతి గూడూ, ప్రతి ఎలుక బిలమూ ఒక్కసారిగా ప్రాణభయంతో వణికి పోయాయి. అయితే అతి స్వల్ప సమయంతోనే అంతా ముగిసి పోయింది. దీర్ఘ, బహుదీర్ఘ కాలపు బీభత్స ఇతిహాసం నుండి కలుషితమైన ఆ భయంకరమైన గూళ్లపై తెల్లని సున్నపు నీటిలో అద్దిన కుంచెలా పగటి వెలుతురు ప్రసరించింది.

ఆ నోటు పుస్తకం వాళ్ల పాదాల కింద నలిగింది. చిరిగిపోయిన దాని పేజీలు ఎండకు ఎండిన ఆకుల్లా గాల్లోకి ఎగిరిపోయాయి. పురుగులు కొరికిన ఆగోనె సంచులూ నేల దొర్లాయి. ఆ పీపా కూడా కిందికి దొర్లింది. చిట్టచివరికి ఆ వ్యక్తి కూడా నేల కూలాడు.

క్యూబా కథకు మూలం : దోరా అలొంసొఘ్రా

అనువాదం : రంగనాథ రామచంద్రరావు

మొక్కజొన్న స్పెషల్స్...

ఇది మొక్కజొన్నల సీజన్.. ఈ మధ్య స్వీట్‌కార్న్ కూడా మనకు విరివిగా దొరుకుతోంది. మామూలు, స్వీట్‌కార్న్ రెండింటితో అనేకరకాల స్నాక్స్ చేసుకోవచ్చు. మొక్కజొన్న మన శరీరానికి ప్రధాన వనరు కూడా. ఇందులో ప్రొటీన్‌లు, పీచు పదార్థాలతో పాటు కాంప్లెక్స్‌డ్ కార్బోహైడ్రేట్లు అందించే మంచి ఆహారం ఉంది. దీనిలో బికాంప్లెక్స్‌తో పాటు బీటాకెరోటిన్ కూడా ఉంటుంది. దీనిని సాయంవేళ స్నాక్స్‌గా తీసుకోవడం ద్వారా తగినంత శక్తిని సమకూర్చుకోవచ్చు. అధికబరువు సమస్యను కూడా నివారించవచ్చు. పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా తింటారు.

హల్వా

కావలసిన పదార్థాలు

స్వీట్‌కార్న్ పేస్టు - ఒక కప్పు, పంచదార - ఒక కప్పు
జీడి పప్పు - ఒక టేబుల్ స్పూన్, కిస్‌మిస్ - ఒక టేబుల్ స్పూన్
నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు
యాలకుల పొడి - అర టీ స్పూన్

తయారుచేసే విధానం

మందపాటి గిన్నె స్టౌ మీద పెట్టి వెలిగించాలి. అందులో నెయ్యి వేసి వేడి చేసి ముందుగా జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్వీట్‌కార్న్ పేస్ట్ వేసి పది నిమిషాలు వేయించాలి. ఆ తర్వాత చక్కెర వేసి బాగా తిప్పాలి. అది దగ్గరగా అయ్యే వరకూ కలుపుతూ ఉండాలి. చివరలో యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ కలిపి దించుకోవాలి. అంతే హల్వా రెడీ. దీన్ని వేడిగానైనా, చల్లార్చి తిన్నా బాగుంటుంది.



ఇడ్లీలు



కావలసిన పదార్థాలు

మొక్కజొన్న పేస్ట్ - ఒక కప్పు
ఉప్పు - తగినంత
నెయ్యి - 1 టీ స్పూన్

తయారుచేసే విధానం

మొక్కజొన్న పేస్ట్ సరిపడా ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. ఇడ్లీ ప్లేట్లకు నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని ఇడ్లీల మాదిరి వేసుకోవాలి. వీటిల్ని ఆవిరిమీద ఉడికించాలి. అంతే మొక్కజొన్న ఇడ్లీలు రెడీ. ఇవి ఆరోగ్యానికి చాలా మంచిది కూడా.

బోండాలు

కావలసిన పదార్థాలు

ఉడకబెట్టిన మొక్కజొన్న గింజలు - ఒక కప్పు
ఉడకబెట్టిన బంగాళదుంప ముద్ద - 1 కప్పు
పచ్చిమిర్చి - 2, అల్లం - చిన్న ముక్క, కొత్తిమీర - ఒక కట్ట
జీలకర్ర - చిటికెడు, ఉప్పు - తగినంత, శనగపిండి - రెండు కప్పులు
నూనె - వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

శనగపిండిలో ఉప్పు వేసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. అల్లం, పచ్చిమిర్చి, ఉడకబెట్టిన మొక్కజొన్న గింజలు మిక్సీ వేసుకోవాలి. ఈ మిశ్రమంలో ఆలుగడ్డ ముద్ద, సన్నగా తరిగిన కొత్తిమీర, జీలకర్ర వేసి కలుపుకోవాలి. దీన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి పెట్టుకోవాలి. వీటిని ముందుగా కలిపిపెట్టుకున్న శనగపిండిలో ముంచి కాగిన నూనెలో వేయించుకోవాలి. అంతే బోండాలు రెడీ.



బూరెలు

కావలసిన పదార్థాలు

మొక్కజొన్న గింజలు - 4 కప్పులు,
పంచదార / బెల్లం - తగినంత
నూనె - వేయించడానికి సరిపడా,
ఉప్పు - చిటికెడు

తయారుచేసే విధానం

మొక్కజొన్న గింజల్ని మిక్సీలో రెండు తిప్పులు తిప్పాక, పంచదార / బెల్లం, ఉప్పు వేసి తిప్పుకోవాలి (మరీ మెత్తగా వేయకూడదు). ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. నూనె బాగా వేడయ్యాక ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలు చేసుకుని అరచేతిలోకి తీసుకొని వత్తి కాగిన నూనెలో వేయాలి. బంగారపు రంగులో వేగాక తీసేయాలి. అంతే బూరెలు రెడీ. ఇవి వేడి వేడిగా తింటే చాలా రుచిగా ఉంటాయి.

స్వీట్ తినని వారు, ఇష్టంలేని వారు పంచదార / బెల్లం బదులు అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, కొత్తిమీర తురుము వేసుకొని గారెలు చేసుకోవచ్చు. వీటికి కాంబినేషన్‌గా టమాటా సాస్ లేదా టమాటా చట్నీ బాగుంటాయి.

\- ఓ. నవ్య



ఆధునిక మానవుని భవిష్యత్తు ఇంధనం పైన ప్రధానంగా ఆధారపడి ఉన్నట్లు అనిపిస్తుంది. పెట్రోలు, డీజిలు, విద్యుత్తు గనక లేకపోతే ఎంత విలవిల్లాడిపోతామో అప్పడప్పుడూ వచ్చే బందులూ, ఎప్పుడూ ఉండే విద్యుత్ కోతలూ ముందే రుచి చూపిస్తున్నాయి. ఈ ఇంధనాలను ఎల్లకాలం కొల్లగొట్టడం అసాధ్యమనీ వాటి విలువలు నిరంతరంగా అందుబాటులో ఉండడం అసంభవమనీ అనేకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటువంటి హెచ్చరికలు గత కొన్ని దశాబ్దాల నుండి వినిపిస్తున్నా వాటి పట్ల అలక్ష్యమే అధికంగా అగుపడుతోంది. ఇటీవలే కొన్ని దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల పట్ల తీవ్రంగా కృషి జరుపుతున్నాయి. అయితే ఆ కృషి ఎక్కువగా అణుఇంధనం వైపు ఉన్నది. కానీ సంప్రదాయేతర ఇంధన వనరులుగా పేరుపడ్డ ప్రకృతి వనరులైన సూర్యరశ్మి వాయువు, జలాల వినియోగం - ఇంధనంగా - కాస్త మందకొడిగానే ఉంది.



సోలార్ వెలుగుల కోసం...

డా॥ కాకర్లమూడి విజయ్

అడపాదడపా అటువంటి ప్రయత్నాలు ప్రయోగస్థాయిలో వార్తల్లో కనిపించినా, అవి స్థూలంగా ప్రజావినియోగంలోకి రావడం లేదు. ఆ ప్రయత్నాలు కూడా, సూర్యరశ్మి కాస్త తక్కువగా ఉండే ప్రాంతాలలో ముఖ్యంగా యూరప్ దేశాలలో జరగడం విశేషం.

వ్యక్తిగతంగా ఉత్సాహంతో చేసే సౌరశక్తి ప్రయోగాలను పక్కన పెడితే, కొన్ని దేశాల ప్రభుత్వాలు సౌరశక్తి వినియోగానికి విధాన నిర్ణయాలూ, ప్రోత్సాహకాలూ ప్రకటించాయి. ఆ క్రమంలో 'ఫొటో వోల్టాయిక్ సెల్' లేదా సోలార్ సెల్లుల (ఇవి ఫొటో ఎలక్ట్రిక్ ప్రభావాన్ని ఉపయోగించి కాంతిని విద్యుత్‌గా మార్చుతాయి) ఉత్పత్తి జర్మనీ, స్పెయిన్ దేశాలలో ఊపందుకుంది. వాటి ఆధారంగా సోలార్ పవర్ స్టేషన్లు నిర్మితమయ్యాయి. ప్రస్తుతం స్పెయిన్‌లో ఆరూ, అమెరికాలో రెండూ సౌర విద్యుత్ స్టేషన్లు వందలాది మెగావాట్ల విద్యుత్‌ని తయారు చేస్తున్నాయి. ఆ రెండు దేశాలే గాక ఇటలీ, జర్మనీ, కెనడా, పోర్చుగల్, ఛెజ్ రిపబ్లిక్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, చైనాలో కూడా భారీ ఫొటోవోల్టాయిక్ పవర్ స్టేషన్లున్నాయి.

వీటిలో స్పెయిన్‌దో ప్రత్యేకత. ప్రస్తుతం ఆ దేశం 3.65 గిగావాట్ల సౌరవిద్యుత్‌ని ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉంది. జర్మనీది రెండవస్థానం. స్పెయిన్‌లో మొత్తం విద్యుత్ ఉత్పాదనలో సౌర విద్యుత్ వాటా మూడు శాతం (ఇది కూడా ప్రపంచంలో అత్యంత అధిక వాటానే!) రాబోయే రెండేళ్లలో స్పెయిన్ 7 గిగావాట్లు ఉత్పత్తి చేసి, సుమారు కోటి మందికి విద్యుత్ అందించే ప్రయత్నాల్లో ఉంది.

స్పెయిన్‌లో 'సోల్యుకార్' అనే సంస్థ రూపొందించిన సౌర విద్యుత్ టెక్నాలజీకి అమెరికాలో కూడా నకలు చేస్తున్నారు. మామూలుగా సోలార్ ప్యానెళ్ల ఫొటో వోల్టాయిక్ సెల్లులను వాడి కాంతిని నేరుగా విద్యుత్‌గా మార్చుతారు. స్పెయిన్‌లో రూపొందించిన కేంద్రీకృత సౌరశక్తి టెక్నాలజీలో భారీ సంఖ్యలో భారీ అద్దాలు సూర్యకాంతిని కేంద్రీకృతం చేసి, విపరీతమైన ఉష్ణాన్ని జనింపజేస్తాయి. ఆ ఉష్ణం సాయంతో ఆవిరి టర్బైన్లను నడిపి, విద్యుత్‌ని తయారు చేస్తారు. ఈ పద్ధతి ప్రస్తుతం బొగ్గుని వాడే థర్మల్ పవర్ స్టేషన్లలో అమలులో ఉన్నటువంటిదే. అయితే సౌరశక్తి వల్ల హానికర హరితగృహవాయువులు వెలువడవు. ఎటువంటి వాయు కాలుష్యమూ కలగదు.

ప్రస్తుతం ఈ స్టేషన్ ఉన్న ప్రదేశంలో ఏడాదిలో దాదాపు 80 రోజులు సూర్యరశ్మి తక్కువగా ఉంటుందట. అయినా సరే, వారి పట్టుదల చెప్పుకోదగ్గదే.

ఇక మన దేశమూ, సహారా వంటి ఎడారుల్లోనైతే ఈ తరహా ప్లాంట్లకి తిరుగే లేదంటున్నారు.

స్పెయిన్‌లో ఏటా సగటున 340 రోజులపాటు సూర్యరశ్మి ఉంటుంది. అందువల్ల అక్కడ సౌరశక్తికే డిమాండు ఎక్కువ. అలాగని మిగతా సాంప్రదాయేతర ఇంధన వనరులను తక్కువ చేసి చూడడం లేదు. స్పెయిన్ ఉత్తరంలో నెవెర్రా ప్రాంతంలో జన సాంద్రత తక్కువ. అక్కడ ఇప్పటికే సౌర, వాయు,

జలశక్తి ఉత్పత్తి మొత్తం వినియోగంలో 75శాతం వాటా కలిగి ఉంది.

అక్కడి వాయు క్షేత్రాలు 20,000 మెగావాట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తున్నాయి. మొత్తం స్పెయిన్ ఉత్పత్తి చేస్తున్న సౌరవిద్యుత్ ఒక అణు విద్యుత్‌కేంద్ర ఉత్పాదనకు సమానమని అంటున్నారు.

భారత దేశంలో విద్యుత్ అవసరతా, సూర్యరశ్మి, జనాభా ఎక్కువే. ఈ కారణంగా సౌరశక్తి ఆవశ్యకత కూడా అధికమే. కానీ ప్రస్తుతం ఒక యూనిట్ విద్యుదుత్పాదనకు సాంప్రదాయ పద్ధతులలో 5-8 రూపాయలైతే సౌరశక్తితో 15 -30 రూపాయలౌతుంది.

ప్రస్తుతం మన దేశంలో సౌరవిద్యుత్ ఉత్పాదన మొత్తం డిమాండులో ఒక శాతం కూడా లేదు.

సరిగ్గా రెండేళ్ల క్రితం, 2020 కల్లా 20 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలని 19 బిలియన్ డాలర్ల విలువగల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది భారత ప్రభుత్వం. ఈ ప్రణాళిక ప్రకారం ప్రతి ప్రభుత్వ బిల్డింగుకూ, హోటళ్లకూ, ఆసుపత్రులకూ సౌరశక్తి ఆధార ఉపకరణాలూ, వ్యవస్థలూ ఉండి తీరాలన్న నిబంధన విధించాలి. అలాగే 2013 కల్లా 1000 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలని మరో ప్రణాళిక కూడా ఉంది.

మనదేశంలో సౌరశక్తి ఉత్పత్తికి ప్రధాన అడ్డంకి నిధులే కాకుండా అనువైన స్థలం కూడా. ప్రస్తుతం 20-60 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లకు సుమారు ఒక చదరపు కిలోమీటరు స్థలం అవసరమౌతుంది. ఆ కారణంగా ఇళ్ల కప్పులపై ప్యానెళ్లు అమర్చడం తేలిక. కానీ రానున్న రోజుల్లో ఖర్చు తగ్గితే ఎవరింటిపైన వారికి సౌరవిద్యుత్ ఉత్పాదక కేంద్రం ఉండే అవకాశం ఉంది.

అది జర్మనీ అయినా, స్పెయిన్ అయినా, మనమైనా మరొకరైనా నిరంతరం ఒకే వనరుపై జీవించలేం. ముఖ్యంగా విపరీతంగా వాడబడే ఇంధన వనరులపై అసలే నమ్మకం లేదు. ఈ నేపథ్యంలో సాంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి పెట్టడం, సాధించడం తప్పనిసరి అవుతోంది. ప్రజల్లో అవగాహన, ఆకాంక్ష ఉన్నా కూడా 'అందుబాటు' ధరలో లేని దేన్నైనా వాళ్లు పట్టించుకోరు. అందుచేత ప్రభుత్వాలే ముందుగా అడుగు వేసి టెక్నాలజీ సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవలసిన అవసరం ఉంది. అదే యూరప్ దేశాలు చేస్తున్నాయి. ఆ రంగంలో ముందున్నాయి. మనము మరీ అధోగతిలో లేముగానీ వేగంగా పురోగమించడం లేదు. నిజానికి మనకే సాంప్రదాయేతర ఇంధన అవసరం ఎక్కువ.

ప్లాస్టిక్ సోలార్ ప్యానెళ్లు

ప్రస్తుతం వినియోగంలో ఉన్న సోలార్ ప్యానెళ్లలోని సెల్సు స్వచ్ఛమైన సిలికాన్‌తో తయారు చేయబడినవి. అందువల్ల అవి కొంచెం ఖరీదైనవే.

బ్రిటీష్ శాస్త్రవేత్తల బృందం ప్లాస్టిక్‌తో సోలార్ సెల్సుని రూపొందించే ప్రయత్నంలో దాదాపు సఫలమైంది. మరో దశాబ్దంలోపే ప్లాస్టిక్ సెల్సు అందుబాటులోకి రావచ్చు. అప్పుడు ప్రభుత్వ సబ్సిడీలకు తోడు తయారీ ఖర్చు కూడా గణనీయంగా తగ్గడం వల్ల సౌరశక్తి వినియోగం మరింత పెరుగుతుందని అంచనా.

సౌర సొరంగం!

బెల్జియంలోని ఒక రైలు సొరంగం రైలుకి రక్షణ కోసం నిర్మించబడింది. ప్రస్తుతం ఆ సొరంగం మరో బాధ్యత కూడా తీసుకుంది. సౌరశక్తిని అందించడం. ప్యారిస్ నుండి ఆమ్‌స్టర్ డ్యామ్‌కి వెళ్లే హైస్పీడ్ రైలు మార్గం ఒక ప్రాచీన అరణ్యం గుండా ప్రయాణిస్తుంది. రైలు మార్గం కోసం చెట్లని నరకడం తగదని, ఒక సొరంగం నిర్మించారు. ఇప్పుడు దానిపై 16000 సోలార్ ప్యానెళ్లు అమర్చారు. వాటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ బెల్జియంలోని అన్ని రైళ్లనూ ఒక రోజు పాటు నడపగలదు.

★ లండన్‌లోని బ్లాక్ ఫ్రయర్స్ స్టేషన్‌లో 4400 సోలార్ ప్యానెళ్లను పై కప్పుకి అమర్చుతున్నారు. అవి ఒక మెగావాట్ విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తాయి. స్టేషన్‌కి అవసరమైన విద్యుత్‌లో 50 శాతాన్ని అందిస్తాయి. వచ్చే ఏడాది ప్రారంభం కానున్న ఈ స్టేషన్ ప్రభుత్వ సబ్సిడీపై ఆధారపడకుండా రవాణా శాఖనుండే 7.3 మిలియన్ పౌండ్లు సేకరించింది.

★ బెంగుళూరులో అత్యధికంగా ఇంటి పైకప్పుపై సోలార్ వాటర్ హీటర్లు ఉన్నాయి. ఇక్కడ అటువంటి వ్యవస్థ అమర్చుకున్న వారికి, వారి నెలవారీ విద్యుత్ బిల్లులో 50 రూపాయలు రిబేట్ ఇస్తోంది యంత్రాంగం. ఇప్పుడైతే ప్రతి కొత్త నిర్మాణానికి ఈ సౌరశక్తి వ్యవస్థ ఉండాలన్న నిబంధనా ఉంది. అలాగే పూణేలో కూడా కొత్త భవనాలకు సౌరశక్తి ద్వారా పనిచేసే వాటర్ హీటర్లు కచ్చితంగా ఉండాలన్న నిబంధన పెట్టారు.

★

హ్హా... హ్హా...

సైడ్ ఎఫెక్ట్!

చందు: ఏంట్రా! టాబ్లెట్‌కి సైడ్లు కత్తిరిస్తున్నావు?

గోవిందు: ఎలాంటి సైడ్ ఎఫెక్టులు రాకుండారా.

భారతి, హైదరాబాద్.

మోసం

కమల్: ఏంటయ్యా! మంచి రేడియో అని చెప్పి మోసం చేశావ్?

షాపు యజమాని: నేనేం మోసం చెయ్యలేదే? అది నిజంగానే మంచి రేడియో!

కమల్: నువ్వేం చెప్పావ్? అది జపాన్‌లో తయారుచేసినదనేగదా. మరి అదేంటి! దిస్ ఈజ్ ఆల్ ఇండియా రేడియో అంటోంది?!

మాధవ్, శ్రీకాకుళం.

అట్టమీది కథ

తెలుగు అమెరికా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ఇటీవల తానా మహాసభలకు హాజరైన సందర్భంగా అమెరికా పర్యటించారు. అక్కడున్న 20 రోజుల్లో 12 రాష్ట్రాలు, 18 నగరాలను చుట్టివచ్చారు. దీన్ని ఓ విహారయాత్రలా కాకుండా...పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్న అసలు సిసలు సానుకూల అంశాలు, సమస్యలు, ఎన్నారైల జీవన విధానాన్ని, వివిధ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు. గతంలో మోటూరు హనుమంతరావుగారు, [illegible]ధుగారు తానా సభలకు హాజరైనా వారు రాజ్యసభ, పార్లమెంటు సభ్యుల హోదాలో వెళ్లారు. ఓ కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా అధికారికంగా ఆ సభలకు హాజరైన తొలి నేత రాఘవులు. అక్కడ వారు ప్రత్యక్షంగా చూసిన, తెలుసుకున్న వివరాలే ఈ వారం అట్టమీది కథలో...

తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) వారి ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లాం. దాదాపు 20 రోజులు పర్యటించాం. ఈ పర్యటనలో సాధ్యమైనంత వరకు పరిస్థితులను, ఆయా దేశాలను, ప్రజలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం.అమెరికాలో ఏపట్టణానికి వెళ్ళినా మీరు మొదటి సారి అమెరికా వచ్చారు కదా అమెరికా ఎలా ఉందండి అని అడిగేవారు. చూసిన మేరకు బాగానే ఉందని చెప్పేవాణ్ణి. పర్యటన ముందుకు జరిగే కొద్ది అమెరికాలో ప్రజల జీవన పరిస్థితులు మనకన్నా అంత ఎందుకు బాగున్నాయో దానికి కారణాలేమిటో అర్థమయ్యాయి. అమెరికాలో తలసరి ఆదాయం 40వేల డాలర్లుంటే మన తలసరి ఆదాయం 400 డాలర్లు మాత్రమే. అయినపుడు వాళ్ళకు మనకు పోలిక చేసుకోవడమే అసహజం. అంత అభివృద్ధి చెందిన అమెరికాలో కూడా బాగా లేనివి చాలా ఉన్నాయి. వాటి గురించి కూడా అర్థం చేసుకోగలిగాం.

మేం ఇక్కడి నుంచి బయలుదేరి సింగపూర్ మీదగా అమెరికా వెళ్లాం. అమెరికా పడమటి ప్రాంతం మనకు సింగపూర్ మీదగా దగ్గర. అమెరికా తూర్పు ప్రాంతం మనకు లండన్ మీదగా అయితే దగ్గర. భూమి గుండ్రంగా వుంటుంది కాబట్టి అమెరికా తూర్పు ప్రాంతానికి, పశ్చిమ ప్రాంతానికి దాదాపు 10 గంటల వ్యత్యాసం వుంటుంది. పది గంటల ప్రయాణం వుంటుంది. శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాలి కాబట్టి సింగపూర్ మీదగా వెళ్లాం. అక్కడి నుంచి అమెరికా వెళ్లడానికి పది గంటల సమయముంది. 'ఏం చేద్దాం?' అనే ఆలోచన చేస్తుంటే విమానాశ్రమంలో ఓ జంట కలిసి తమ ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ ప్రత్యేకమైన వీసా ఏం అవసరం లేదు. ట్రాన్సిట్ ప్యాసింజర్లకు ఒక పాస్ ఇస్తారు. అది తీసుకుని చూసొచ్చాం. సింగపూర్ జనాభా 50 లక్షలు. మెట్రో హైదరాబాద్ కన్నా చిన్నది. ప్రపంచంలో పెద్ద వ్యాపార కేంద్రం. ఇండొనేషియాకు బాగా దగ్గరలో వుంటుంది. వీరికి ఏం కావాల్సినా ఇండొనేషియాకు రావాల్సిందే. ఆఖరుకు ఇళ్లల్లో మొక్కలు పెంచుకొనేందుకు మట్టి కావాలన్నా అక్కడ నుంచి తెచ్చుకోవాల్సిందే. నీళ్లు రావాలన్నా ఇండొనేషియా నుంచి రావాల్సిందే. కూరగాయలు కూడా అక్కడి నుంచే వస్తాయి. ఆ రకంగా పక్క దేశం మీద ఆధారపడివుంది. సింగపూర్ వ్యాపారం మీదే నడుస్తుంది. వ్యాపార ప్రధానమైనది కాబట్టి అన్నీ కార్యకలాపాలు వ్యాపార ప్రధానంగానే వుంటాయి. ఇళ్లు కొనుక్కునే వారికి అవకాశం ఇస్తుంది. వివిధరకాల ఆదాయాలు కలిగిన మిగతావారికి ప్రభుత్వమే కట్టి అద్దెలకు ఇస్తుంది. సింగపూర్ వాసులకు డెంగ్యూ, మలేరియా వంటి జబ్బులంటే విపరీతమైన భయం. ఎవరైనా 'మా ఇంట్లో దోమలున్నాయ్' అని ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చేసి వాటిని నిర్మూలించేవరకూ వదిలిపెట్టరు. జీవన ప్రమాణాలు బాగుంటాయి కాబట్టి అంతా శుభ్రంగానే వుంటుంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వుంది. టాక్సీలు చాలా ఎక్కువగానే అందుబాటులో వుంటాయి. సింగపూర్‌లో మలేషియన్లు, యూరోపియన్లే కాకుండా తమిళులు ఇతర భారతీయులు కూడా ఎక్కువగానే వున్నారు. పాలనలోనూ పాలుపంచుకుంటారు. నీరు, కరెంటు...నిర్వహణ ప్రభుత్వ సంస్థలదే. ఇక్కడ వినోదం కూడా వ్యాపారపరంగానే వుంటుంది. కొంచెం విచిత్రంగానూ వుంటుంది. అవినీతి తక్కువగా వుంది. అన్ని వ్యవస్థల్లో వ్యాపారం చేసినట్టే ఎంటర్‌టైన్‌మెంటు కూడా ఎలా నిర్వహిస్తారో తెలుసుకోవడానికి ఒక ఉదాహరణ. మామూలుగా ఉత్సాహవంతులు ఎవరైనా చేపల వేటకు వెళ్లాలంటే సముద్రానికో, నదులకో ఒక గేలం పట్టుకొని వెళతారు. కానీ సింగపూర్‌లో 20/20 అడుగుల తొట్టెలు చేసి వాటిలో నీళ్లు నింపి రంగులు కలిపి రొయ్యలు, చేపలు వేస్తారు. మనకు చేపలు, రొయ్యలు కనిపించవు. తొట్టె పక్కన కూర్చుని చేపలు పట్టుకోవచ్చు. ఏదైనా గేలానికి పడితే దానికో ధర. దాని పక్కన పొయ్యిలు అద్దెకిస్తారు. వాటిలో కాల్చుకొని తినదల్చుకుంటే మరో

రేటు. బ్యాడ్‌మెంటన్ కోర్టులు, టెన్నిస్ కోర్టులు, బిలియర్డ్ కోర్టులు నెట్‌లో బుక్ చేసుకొని ఆడుకోవచ్చు. గంటకు ఇంతని రేటు చెల్లించాలి. వీటన్నిటినీ ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ప్రతిదీ వ్యాపారమే.

సింగపూర్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్‌కో చేరాం. సెప్టెంబర్ 11 తర్వాత పత్రికల్లో చదివినదాన్ని బట్టి సెక్యూరిటీ ఎలా వుంటుందోనని అనుకుంటాం. మన దగ్గర చెకింగ్‌తో పోల్చుకుంటే అక్కడ తక్కువ. వారిది ఇన్విజిబుల్ సెక్యూరిటీ. దేశంలోకి ప్రవేశించేటప్పుడు, బయటికెళ్లేటప్పుడు శరీరం మొత్తాన్ని చెక్ చేసే యంత్రం వుంటుంది. అసలు అది వున్నట్టు కూడా మనకు తెలీదు. ఆ యంత్రంలోంచి బయటకు వెళ్లాలి. గట్టి సెక్యూరిటీ వుందనిపించదు. దేశంలో ప్రవేశించే వారిలో ఓ రెండు వందల మందికో మూడు వందల మందికో ఒకరిని తడిమి చెక్ చేస్తారు. అయితే మర్యాదగా చెప్పి మరీ చేస్తారు. అమెరికాలో వుండే వారికి తీవ్రమైన సెక్యూరిటీ వుందనిపించవచ్చు. కానీ మనకు అలా అనిపించదు.

ఆ ఇరవై రోజుల్లో ఎక్కువ భాగం తెలుగువారి ఇళ్లలోనే వున్నాం. పిల్లలు, చదువులు, ఉద్యోగాలు వంట, ఇళ్లు ఎలా వున్నాయి? ఎలా నివసిస్తున్నారు? బట్టలు, ఏం కడుతున్నారు? ఏం తింటున్నారు? వారి ఇళ్లకు మన ఇళ్లకు ఏమైనా వ్యత్యాసాలున్నాయా? ఏమేం సామాన్లున్నాయి? వంటివి పరిశీలించాం. మేం బస చేసిన ఇళ్లన్నీ మధ్యతరగతివారివే. ఐటీలోనో, ఇతర రంగాల్లోనూ పనిచేస్తున్న వారు కాబట్టి అమెరికా ప్రమాణాలతో చూస్తే దిగువ మధ్య తరగతిగా వేసుకోవచ్చు. వీరిలో కూడా కొందరివి సొంత ఇళ్లు. అద్దెకు తీసుకున్న వారి ఇళ్లలోనూ వున్నాం. దిగువ మధ్యతరగతి వారివి రెండు, మూడు బెడ్రూముల ఇళ్లు. ఎగువమధ్య తరగతి వారు నాలుగు బెడ్రూముల ఇళ్లు. అక్కడ బాత్‌రూములు ఇళ్లు వేరుగా కట్టుకోడానికి ఇష్టపడతారు. అమెరికా కల్చర్ మనవాళ్లకు వుండదు. అమెరికాలో ఎవరికి వారు పడుకుంటారు. పిల్లలు తల్లిదండ్రుల గదుల్లో వుండరు. పిల్లలకు వేరే గదులు. పుట్టినప్పటినుంచి అంతే. ఎగువ మధ్య తరగతివారికి ప్రతి బిడ్డకు ఒక గది. దిగువమ మధ్య తరగతి వారి ఇళ్లలో అయితే బెర్తు మంచాలుంటాయి. మేం వెళ్లిన ఇళ్లన్నీ డూప్లెక్స్ టైప్ ఇళ్లు. ఇక్కడ ముసలివాళ్లు వుండడం కొంచెం కష్టం. మెట్లెక్కి కింద నుంచి పైకి పోవడమనేది కష్టం. అమెరికన్లు ఎత్తుగా వుంటారుకాబట్టి సులభం. మధ్య-దిగువ మధ్య తరగతి వారు 2 దశాబ్దాలుగా ఊరి శివార్లలోకి వెళ్లి ఇళ్లు కట్టుకొని వుంటున్నారు. వ్యాపార కేంద్రాలు, ఆఫీసు కేంద్రాలు వుండేవాటిని అమెరికా పరిభాషలో డౌన్ టౌన్స్ అంటారు. ఇక్కక అపార్ట్‌మెంట్స్ కొనాలంటే కష్టం. అందుకే ఊరికి దూరంగా కట్టుకుంటారు. కార్లు వుంటాయి కాబట్టి ఇబ్బంది వుండదు. ఇక్కడ కట్టేవన్నీ సింగిల్ హౌసెస్. ఎవరికి వారు ప్రత్యేకమైన ఇళ్లు డెవలప్ చేశారు. టౌన్ హౌసులు కూడా వున్నాయి. ఇవి కూడా సింగిల్ హౌస్‌లే కనిపిస్తాయి. రెండు మూడు ఇళ్లు కలిపి కట్టుకోవడం. కండోమియన్స్ ఇళ్లు కూడా వున్నాయి. మూడు, నాలుగు అంతస్తులు లాగా కట్టి అమ్ముతారు. అపార్ట్‌మెంట్ నాల్గవ పద్ధతి. ఒక డెవలపర్ ఒక మల్టీస్టోర్డ్ బిల్డింగ్ కట్టి అద్దెకిస్తాడు. ఈ శివారు ప్రాంతాల్లో వ్యక్తిగత ఇళ్లే వుంటాయి. మనవాళ్లు కొన్న ఇళ్లు చూస్తే 3 లక్షల డాలర్ల నుంచి 10 లక్షల డాలర్ల వరకు ధర వుంటుంది. ఆ ప్రాంతంలో మంచి స్కూలు వుందంటే ఇంటి రేటు ఎక్కువ. అలాగే చెరువు వున్నా, నది వున్నా, మంచి మార్కులొచ్చే స్కూలు వున్నా ఇంటికి రేటు ఎక్కువ పలుకుతుంది. అలాగే నల్లవారు తక్కువగా వుండే ప్రాంతాల్లో ఇళ్ల ధర ఎక్కువ. అటువంటి ప్రాంతాల్లో ఇళ్లు కొన్నవారు నలుగురైదుగురు వున్నారు. డాక్టర్లు, లాయర్లుగా పది ఇరవై ఏళ్లు అక్కడ వుండి బాగా సంపాదించుకున్నవారు అలాంటి ఇళ్లు కొనుక్కున్నారు. ఎక్కువ మంది దిగువ మధ్యతరగతి వారు 5 లక్షల డాలర్ల ఇళ్లు కొనుక్కున్నారు.

అమెరికాలో ఇళ్లన్నీ ఎక్కువగా చెక్కతో నిర్మిస్తారు. చెక్కతో కట్టినవే కాబట్టి అగ్ని ప్రమాదాలు ఎక్కువ. అందుకే అగ్నిమాపక దళాలు ఎక్కువ. కాలిఫోర్నియా, అమెరికా పశ్చిమభాగంలో భూకంపాలు ఎక్కువగా వస్తుంటాయి కాబట్టి కలప ఇళ్లు ఎక్కువ. అవి కూలిపోయి మీద పడినా నష్టం తక్కువ. కాబట్టి కలపనే ఉపయోగిస్తారు. అన్నిటికన్నా ఎక్కువ స్ట్రాంగ్‌గా వుండే గది బాత్‌రూమ్. భూకంపం వస్తే అందులోకే వెళ్లమంటారు. అక్కడ వాతావరణం కూడా తీవ్రమైన వైరుధ్యాలతో వుంటుంది. మేం వెళ్లినప్పుడు వేసవి కాలం కాబట్టి 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వుంది. అక్కడ శీతాకాలంలో జీరో కంటే తక్కువకు కూడా పడిపోతుంది. అంత వేడికి, చలికి తట్టుకోవాలంటే చెక్కతో ఇళ్లు కట్టాల్సిందే (సిమెంట్‌తో కడితే తట్టుకునే పరిస్థితి లేదు). తడిని పీల్చుకుని చలికి తట్టుకుంటుంది. తేమకు ఫంగస్ రాకుండా చెక్కను వాడతారు. మంచు ఎక్కువ కనుక యూరోపియన్ దేశాల్లోనూ చెక్కను వాడతారు. పై కప్పులు కూడా చదరంగా కాకుండా మంచు రాలిపోవడానికి వీలుగా ఏటవాలుగా వుంటాయి. ఇళ్ల నిర్మాణంలో కూడా అగ్ని ప్రమాదం జరగకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఇంట్లో సిగరెట్ తాగరు. చెక్క మీద కూడా కార్పెట్ వేస్తారు. ఇంట్లో అంతా చెక్కతో వుంటుంది కనక టాయిలెట్లలో, బాత్‌రూముల్లో నీళ్లు వాడరు. పేపర్ వాడతారు. ఇది మనకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది. బాత్‌రూం, టాయిలెట్ వాడినా పట్టా వేసి తుడుచుకోవాలి. మన దేశంలో ఇళ్లు



మెయింటైన్ చేయడం సులభం. అక్కడ కష్టం. భార్యాభర్తలిద్దరూ పనిచేయకపోతే ఇవన్నీ తట్టుకోవడం కష్టం. క్వాలిఫికేషన్ వుంటే సరి. ఉద్యోగం వెతుక్కుంటారు. లేకపోతే చిన్నాచితకా పనులు చూసుకుంటారు. మెట్లు కడగడం, అంట్లు తోమడం, బాత్‌రూములు కడుక్కోవడం అనేది ఎవరికి వారే చేసుకుంటారు. ముఖ్యంగా మిలియన్, అరమిలియన్ డాలర్ల ఇళ్లలో వుండేవారు ఆ పని సొంతగా చేసుకోవాల్సిందే.

మేం బస చేసిన ఇంటి వారు నెలకోసారి పనివారితో ఇల్లు శుభ్రం చేయించుకుంటారు. రెండు గంటల పాటు పనిచేసినందుకు వారికి వంద డాలర్లు ఇవ్వాలి. మామూలుగా ఇంత మొత్తం డబ్బు కట్టాలంటే భార్యాభర్తా వారంరోజులపాటు పనిచేసి సంపాదించిన సొమ్ము కట్టాలి. ఇంటికి రంగులు వేయడం, వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయడం వంటివి వారే చేసుకుంటారు. పిల్లలను ఆడించడం కూడా మగవాళ్లు చేస్తారు. ఆడామగా సమానత్వం కొంత కనిపిస్తుంది. స్త్రీలను గౌరవంగా చూడాలి. వారితో మర్యాదగా ప్రవర్తించాలి. భార్యను కొడితే పోలీసులు తీసుకెళతారు. పిల్లలను కొట్టినా అంతే! 911కు ఫోన్ చేస్తే చాలు. భార్యాభర్తలను తీసుకెళ్లి స్టేషనుకు పిలుస్తారు. గృహహింస చట్టాలు బాగా వున్నాయి. పిల్లలను మర్యాదగా, గౌరవంగా చూస్తారు. అమెరికా వాళ్లే కాదు. అక్కడ ఎన్నారైలు కూడా పిల్లలను కొట్టరు. తల్లిదండ్రులు పిల్లలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్కూలు టీచర్లకు తెలిస్తే వారు పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. అక్కడ పిల్లల పట్ల ఎక్కువ ప్రేమను చూయిస్తారు. అక్కడ 20 శాతం తెల్లవారికి పిల్లలుండరు. పిల్లలు లేనివారు ఎక్కువగా పెంపుడు జంతువులను ఇష్టపడతారు. పిల్లులు, కుక్కలు పెంచుకుంటారు. కొందరి ఇళ్లలో రెండేసి మూడేసి కూడా పెట్స్ వుంటాయి. అయితే వాటిని వ్యాహ్యాళికి తీసుకెళ్లినప్పుడు అవి రోడ్లమీద ఒకటి రెండూ కానిచ్చేస్తే మాత్రం యజమానికి కష్టం. వారే దాన్ని ఎత్తి చెత్తబుట్టలో వేయాలి. ఇక పెట్స్ కోసం చేసే హంగామా అంతా ఇంతా కాదు. వాటికోసం ప్రత్యేకంగా హోటళ్లే వున్నాయి. ప్రత్యేకంగా వాటికి ఆహారం, బట్టలు, జుట్టు కత్తిరించే షాపులు, బ్యూటీ సెలూన్లు... ప్రధాన రహదారుల్లో కనిపిస్తాయి.

ఇంటితోపాటు స్టవ్, ఓవెన్, వాషింగ్ మెషీన్, డ్రయ్యర్ వంటివి ఉంటాయి. అపార్ట్‌మెంట్ అయితే వాషింగ్ మెషీన్లు పెడతారు. ఎవరి బట్టలు వారు ఉతుక్కున్నా డబ్బు చెల్లించి వెళ్లాలి. ప్రతి టౌన్‌లోను వాషింగ్ మెషీన్ షాపులుంటాయి. డబ్బులు కట్టి మన బట్టలు మనమే ఉతుక్కోవాలి. బట్టలు తూకం వేసి దానికి సరిపడా సర్ఫ్ వేసి డబ్బులు కాయిన్ బాక్స్‌లో వేస్తే ఉతికి డ్రై చేస్తుంది. ఇక సెలూన్ల సంగతి. అక్కడ ఛార్జీ 13 డాలర్ల (రు.500) నుంచి 40 డాలర్ల (రు.2000) వరకు వుంటుంది. మతాన్ని బట్టి క్షవరం చేసే షాపులూ వుంటాయి.

సేవలు కొనుక్కోవచ్చు

ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో గడ్డి పెంచాల్సిందే. కత్తిరించాల్సిందే. ఓపిక వుంటే లాన్ సర్వీస్ చేయించుకోవచ్చు. అంటే డబ్బులిస్తే వచ్చి గడ్డి కత్తిరించి వెళతారన్నమాట. మంచినీరు ట్యాప్ వాటర్ తాగాల్సిందే. కాకపోతే అవి శుభ్రంగా వుంటాయి. చనిపోతే సిమెట్రీ సర్వీసులు చేసే కంపెనీలూ వుంటాయి. చనిపోయినవారి మతాచారం ప్రకారం వాటిని పూర్తి చేస్తాయి. ఇంటి పనిచేసేవారు, పిల్లలను చూసుకునేవారు, జబ్బు చేసినప్పుడు చూసుకునేవారు... వుంటారు. ప్రతి ఒక్కరికీ సర్వీసు చార్జీ ఇచ్చుకోవాలి. సొంతగా కారు డ్రైవర్, క్లీనర్, పనిమనుషులను పెట్టుకోవడం చాలా కష్టం. వచ్చే జీతాలు వారికే సరిపోతాయి.

చదువు ఫ్రీ

కొన్ని స్కూళ్లకు వెళ్లి చేసాం. ఇక్కడ 12 వ తరగతి వరకు పిల్లలకు విద్య ఉచితం, నిర్బంధం. పుస్తకాలు, భోజనం, స్కూలు బస్సు ఉచితం. ఎలిమెంటరీ స్కూలుకు 20 ఎకరాలు స్థలం వుంటుంది. అక్కడ స్కూలు భవనం కార్పొరేట్ స్కూల్ లాగా వుంటుంది. పంచాయతీ లైబ్రరీ పాతిక ముప్పై ఎకరాల్లో వుంటుంది. పుస్తకాలు, డీవీడీలు, ఫీజులు, మల్టీ మీడియా సౌకర్యాలు వుంటాయి. 24 గంటల ఇంటర్నెట్ సౌకర్యం వుంటుంది. నూటికి 90 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటారు. ప్రయివేటు స్కూళ్లలో 1500 డాలర్లు చెల్లించాలి. మిలియనీర్లు, బిలియనీర్లు మాత్రమే తమ చిన్నారులను ప్రయివేటు స్కూళ్లకు పంపిస్తారు. బట్టీ వేయించకపోయినా సృజనాత్మకంగా చదివిస్తారు. ఆటలు, పాటలు, సంగీతం వుంటాయి. ఇండియన్లు, నల్లజాతివారు వున్న స్కూళ్లలో తెల్లవారు తమ పిల్లలను చేర్చరు.

అంతా బీమాపైనే...

రెండు మూడు ఆసుపత్రులను కూడా పరిశీలించాం. వైద్యం నూటికి 80 శాతం ప్రయివేటు వారి చేతిలోనే వుంటుంది. పసిపిల్లలకు, యుద్ధాలు చేసి విరమణ పొందిన వారికి ఇన్సూరెన్సు వుంటుంది. ఇక్కడ అత్యవసరం అనిపిస్తే ఇన్సూరెన్స్ లేని ఎవరికైనా ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం చేయాల్సిందే. ఆరోగ్యం మొత్తం బీమా మీదే ఆధారపడివుంది. ఎమర్జన్సీ అంటే వెంటనే వైద్యం చేస్తారు. మామూలుగా అయితే అపాయింట్‌మెంట్‌కే రెండు రోజులు పడుతుంది. అమెరికా జనాభా 30 కోట్లు. ప్రతి ఆరుగురు రోగులకు ఒక నర్సు వుంటుంది. ఇన్సూరెన్స్ కంపెనీల మీద ఆధారపడి వైద్యం వుంటుంది కాబట్టి డాక్టర్లకు 50 శాతం సమయం రికార్డులు రాయడానికే పోతుంది. అందుకే జలుబు, జ్వరాలు వస్తాయంటేనే భయపడతారు.

బయటి ఫుడ్డే ఎక్కువ

ఇంటికి కావాల్సిన కూరగాయలు, సామాన్లు వాల్‌మార్ట్ వంటి పెద్ద పెద్ద కంపెనీల్లోనే కొనుక్కోవాలి. నల్లజాతి ప్రాంతాల్లో మాత్రమే మన చిక్కడపల్లి వంటి బజార్లు, చిన్న చిన్న షాపులు కనిపిస్తాయి. ఇంటి నిర్మాణానికి కావాల్సిన మట్టి, ఇటుకలు... మొదలుకొని సర్వం లభించే షాపులు కూడా వుంటాయి. వీటిని కూడా కంపెనీలే అందిస్తాయి. అక్కడ రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఎక్కువగా కనిపిస్తాయి. మెక్‌డోనాల్డ్, సేఫ్‌వే వంటి పెద్ద పెద్ద కంపెనీలు దర్శనమిస్తాయి. ఇంట్లో వంట తక్కువగా చేసుకుంటారు. బయటి తిండే ఎక్కువ. చవగ్గా వుండడం కూడా అందుకు ఒక కారణం. రెస్టారెంట్లలో ఖర్చు చాలా ఎక్కువ. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చవక. కాకపోతే తినేవాటిని ఎవరికి వారే తెచ్చుకోవాలి. తిన్నవాటిని డస్ట్‌బిన్లలో వేయాలి. తిన్న టేబుల్ దగ్గర ఎంగిలి పడితే శుభ్రం కూడా చేయాలి.

ఎక్కడికి వెళ్లినా క్యూ పాటించాలి. అదీ రెండు అడుగుల దూరంతో నిలబడాలి. కార్లు దిగి పార్క్ చేసి వచ్చి ఫుడ్ తీసుకోవడం కష్టం కనక కార్లతోపాటుగా వెళ్లి టోకెన్ తీసుకుని ఫుడ్ తీసుకునే సౌకర్యం కూడా వుంది.

అంతా రివర్స్!

కారు డ్రైవరు ఎడమ చేతివైపు కూర్చుని కుడిచేతి వైపు నడుపుతాడు. మనకు లైటు స్విచ్ కిందికి వేస్తే వెలుగుతుంది. వాళ్లకు మాత్రం పైకి వేస్తే వెలుగుతుంది. టాయ్‌లెట్‌లో వాటర్ బటన్ కూడా పైకి అంటేనే ఫ్రెష్ అవుతుంది. మనది సెంటీగ్రేడ్ అయితే వారిది ఫారిన్ హీట్. నీళ్లను వారు గ్యాలన్లలో కొలిస్తే మనం లీటర్లలో కొలుస్తాం. బరువును తూచడానికి మనకు కేజీలు వారికి పౌండ్లు. అన్నీ భిన్నంగా వుంటాయి.

కారుతో సహా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ కిటికీ దగ్గరకు వెళ్లి డబ్బు కట్టి టోకెన్ తీసుకోవచ్చు. అదే కారులో మరో కిటికీ దగ్గరకెళ్లి ఫుడ్ తీసుకొని వెళ్లిపోవచ్చు. వాతావరణం -20 డిగ్రీల దగ్గర వున్నప్పుడు కారు దిగి ఇదంతా చేయడం కష్టం కనక ఈ పద్ధతి పెట్టుకొని వుండొచ్చు. కాఫీ కప్పు మన పెద్దలోటా పొడవు వుంటుంది. దాని లోపల స్ట్రా వేసి పైన మూత పెట్టి మరీ ఇస్తారు.కారులో వెళుతూ, నడుస్తూ కూడా నింపాదిగా దాన్ని తాగొచ్చు. డ్రైవింగ్ చేసేప్పుడు ఒలికిపోతుందన్న బెంగ వుండదు. ఇక్కడ జున్ను, బీఫ్, బంగాళాదుంప పదార్థాలు బాగా ఇష్టంగా తింటారు. వీటికి తోడు బ్రెడ్డు, బర్గర్లు వుండనే వుంటాయి.

ఊబకాయులు ఎక్కువే

ఇక్కడ రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎక్కువేనని చెప్పుకున్నాంకదా. ప్రతి ఒక్కరూ ఎప్పుడూ ఏదో ఒకటి తింటూనే వుంటారు. అందుకే ఇక్కడ స్థూలకాయం ఎక్కువే. దేశ జనాభాలో 17 శాతం జనాభా ఊబకాయంతో బాధపడుతోంది. 34 శాతం జనాభా సాధారణ బరువు కన్నా ఎక్కువ బరువు వున్నారు. ఆఫ్రికన్ అమెరికన్లు బాగా లావుగా వుంటారు. సహజంగా ప్రతి జనవరిలోనూ నూతన సంవత్సర నిర్ణయాల్లో భాగంగా బరువు తగ్గాలని ప్రతిన బూనతారు. అందుకు తగ్గట్టుగానే జనవరి, ఫిబ్రవరి మాసాల్లో జిమ్ములు కళకళలాడతాయి. తర్వాత అన్నీ బోసిపోతాయి.

ట్రాఫిక్ నిబంధనలు కఠినమే

రోడ్ల మీద ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే అంతే సంగతులు. కారుతో రోడ్ల మీద వున్నాడూ అంటే వెళ్తానే వుండాలి. ఆగకూడదు. కారు డ్రైవర్‌తోపాటు పక్కన కూర్చున్నవారు కూడా సీట్ బెల్టులు పెట్టుకోవాల్సిందే. డ్రైవర్ సీట్ బెల్టు వేసుకుని ఇతరులు పెట్టుకోకపోయినా అతనికే ఫైన్ వేస్తారు. రెడ్ సిగ్నల్ దాటితే ఫైన్ పడిపోతుంది. ఇన్సూరెన్స్ కంపెనీవారు ప్రీమియం రెట్టింపు చేస్తారు. అలా మూడు సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తారు. ఇది లేకుండా అమెరికాలో చాలా కష్టం. ట్రాఫిక్, పార్కింగ్ నిబంధనలు కఠినంగా వుంటాయి. పది ఎకరాల్లో బిల్డింగ్ కడితే యాభై ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయాలి. చికాగో యూనివర్సిటీలో పెయిడ్, సొంత, కాయిన్ పార్కింగ్ అని మూడు రకాలు వుంటాయి. గంటకు ఇంత అని ఇవ్వాలి. మనకు లోపల రెండు గంటల పని వుంటే అంతకు డబ్బు కట్టి వెళ్లిపోవాలి. ఒకవేళ మనకు లోపల ఆలస్యం అయితే దానికి మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది. మేము రెండు గంటల కోసం కాయిన్స్ వేసి వెళ్లాము ప్రొఫెసర్స్‌తో మాట్లాడుతూ సమయం రెండు గంటలు దాటిపోయింది. కారు వద్దకు చూస్తే 30 డాలర్ల ఫైన్ కట్టమని చీటీ ముందు అద్దానికి అంటించి వుంది. దీన్ని అక్కడి పరిభాషలో టికెట్ ఇచ్చారంటారు. ఒకవేళ వాహనం నడుపుతున్నప్పుడు వేగం ఎక్కువైతే పోలీసు లైట్ వేస్తాడు. అది పడిందీ అంటే ఆగాల్సిందే. అలాగని కారులోంచి బయటికి రాకూడదు. డ్రైవర్‌కి రెండవ వైపునుంచి కారు కిటికీ దగ్గరకు పోలీసు వస్తాడు. అప్పుడు అతను అడిగిన వివరాలన్నిటికీ సమాధానం చెప్పాలి. అయితే మేం అక్కడున్న 20 రోజుల్లో ఒక్కసారి కూడా హారన్ మోత వినలా. హారన్ మోగిస్తే వాడు చేతగాని డ్రైవర్ కిందే లెక్క. అనవసరంగా హారన్ మోగించకూడదు. ట్రాఫిక్ రూల్స్ లేకపోతే 200 కి.మీటర్ల వేగంతో అయినా వెళ్లగలిగేంత వెడల్పుగా రోడ్లున్నాయి.

పోలీసు వ్యవస్థ మనకంటే బెటర్‌గా వుంటుంది. అవినీతి తక్కువ అని చెప్పారు. రెడ్‌వుడ్ సిటీ పోలీస్‌స్టేషన్ వెళ్లాం. 70, 000 జనాభా వున్న ఆ పట్టణ పోలీస్ స్టేషన్లో 120 మంది పోలీసులున్నారు. వారిలో 20 మంది గుమస్తాలు, కంప్యూటర్ ఆపరేటర్లు. వారికి 25 మోటారు సైకిళ్లు, 30 బిఎండబ్ల్యు కార్లున్నాయి. ప్రతి దాంట్లో కంప్యూటర్ వుంటుంది. అవి ఇతర పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేసి వుంటాయి. ఫైర్ స్టేషన్లు కూడా ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి. ఫోన్ వచ్చిన 2 నిముషాల్లో ఆ ప్రాంతానికి చేరుకునేలా రెడీగా వుంటారు సిబ్బంది. ఇక్కడ మన 108 లాగా అక్కడ 911కు ఫోన్ చేస్తే ఫైర్ స్టేషన్ వారు బయలుదేరతారు. అయితే మనకిక్కడ ఆరోగ్య సమస్యలకు మాత్రమే ఆ నెంబరు పనికివస్తుంది. అక్కడ మాత్రం ఏ సమస్యకైనా స్పందిస్తారు. కావాల్సిన సాయం అందిస్తారు. అందుకే ఈ సిబ్బందికి గౌరవం ఎక్కువగా వుంటుంది. స్కూలు పిల్లలు కూడా పెద్దయ్యాక ఫైర్ ఆఫీసర్ కావాలనుకుంటున్నామని చెప్తుంటారు. ★



ఎన్నారై ఎపిసోడ్...

న్యూజెర్సీలో తప్ప ఎక్కడా పెట్రోలు కొట్టే సిబ్బంది వుండరు. అంతా యంత్రాలే చూసుకుంటాయి. భారత్ నుంచి వెళ్లిన వారిలో పెద్దగా చదువులేని వారు, విద్యార్థులు చిన్న చిన్న పనులు చూసుకుంటారు. హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో సహాయకులుగా వుంటారు. బేబీ సిట్టర్లు (పిల్లలను చూసుకునేవారు)గా పనిచేస్తారు. గంటకు 4 నుంచి 8 డాలర్లు లభిస్తాయి. పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటారు. ఇవేవీ కాకపోతే ఊరగాయలు, కరివేపాకు పొడులు తయారు చేసి అమ్మడం వంటివి చేస్తారు. చీరలు అమ్మడం, రోలింగ్ చేయడం కూడా కనిపిస్తుంది. వారం మొత్తం మీద 15 నుంచి 17 గంటలకు తక్కువ పనిచేసే వారుండరు. ఆ మాత్రం పనిచేయకపోతే ఇంటిమీద తీసుకున్న రుణాలు తీర్చలేరు. మనవాళ్లు పిల్లలను 12వ తరగతి వరకు అక్కడ చదివిస్తారు. తర్వాత ఇక్కడకే పంపేస్తుంటారు. అప్పటి వరకు అక్కడ విద్య ఉచితం కావడం ఒక కారణం. అక్కడి కల్చర్ రెండవ కారణం. అక్కడ 18వ ఏడు వచ్చే వరకే పిల్లలను తల్లిదండ్రుల వద్ద వుండనిస్తారు. తర్వాత వారి బతుకు వారు బతకాల్సిందే. పిల్లల పెళ్లిళ్లు కూడా పెద్దలు చేయరు. వీటి ప్రభావాలు పిల్లల మీద ఎక్కడ పడతాయోనని చిన్నతనం నుంచే ఇంట్లో క్లాసులు తీసుకుంటుంటారు మనవాళ్లు. ఇక్కడ మనకు వున్నట్టే అక్కడా మనవాళ్లకి కులాలు, ప్రాంతాలు, గుళ్లు, భజనలు వున్నాయి. తానా, ఆటా, నాటా, చిత్తూరు ఎన్నారై, నెల్లూరు ఎన్నారై, గుంటూరు ఎన్నారై, రేపల్లె ఎన్నారై వంటి సంఘాలు తయారయ్యాయి. వీటిలో పనిచేసే వారు కొంత కాలం తర్వాత ఇండియా రావాలని చూస్తుంటారు. వీరిలో నిజంగా సేవచేసేవారు కొందరైతే రాజకీయ ప్రయోజనం కోసం చేసే వారు కొందరు. వచ్చాక రాజకీయాల్లో స్థిరపడాలనుకునే వారూ ఎక్కువే. ఎన్నికల్లో నిలబడ్డానికి టికెట్ కొనుక్కుంటారు. తర్వాత ఓట్లు కొనుక్కుంటారు.

కథ

"ఇదిగోనయ్యా! ఈ చాయ్ తాగు. ఆ చీపురిటియ్యి. నేనూడుస్తాలే. నేనుండగా నీకెందుకయ్యా ఈపని" అంటూ గురవయ్య చేతిలోని చీపురు తీసుకుని కొట్టమంతా శుభ్రంగా ఊడ్చి, బసవడికి ఇంత గడ్డేసి లోపలికెళ్లింది పున్నమ్మ. గురవయ్య తన భార్య పున్నమ్మ ఇచ్చిన చాయ్ తాగుతూ వేపచెట్టు కిందున్న బండమీద కూర్చొని బసవన్ననే చూస్తున్నాడు. ఇంతలో వాకిలికి అడ్డంగా పెట్టిన కంక తడికె తీసుకుని లోనకొచ్చిన ఆసామి లక్ష్మయ్య గురవయ్య పక్కనే కూర్చున్నాడు.

సహజీవనం

- రావుల కిరణ్మయి

"ఏం గురవయ్యా! నిన్న నేను చెప్పిన విషయం గురించి ఏమాలోచించావ్. రేపే బొంబాయి నుండి లారీ వత్తాంది. మనూరోళ్ల పదిమందిదాక వయసైన ఎడ్లను అమ్ముతున్నరు. మరి నీ బసవన్నని కూడా అందులో ఎక్కిత్తున్నవా? లేదా?" అన్నాడు గురవయ్య మొహంలోకి తదేకంగా చూస్తూ.

గురవయ్య లక్ష్మయ్య వైపు తిరిగాడు. కానీ ఆయన మాటలకు కళ్లలో నీళ్లు తిరగడం వల్ల లక్ష్మయ్య మొహం మసక మసకగా కనిపించింది. భుజమ్మీది తువాలు తీసి కళ్లు తుడుసుకుంటూ...

"లచ్మయ్యా! నేను మా బసవడిని ఎవరికీ అమ్మదలుచుకోలేదు. నాకు మనసొప్పడం లేదు" అన్నాడు దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో.

"ఏంది గురవయ్యా! అట్టా మాట్లాడ్తవ్. నేనేమన్నా పన్జేసే ఎద్దును అమ్మమంటన్నానా ఏంది? నీ బసవడికి రెండు మూడుసార్లు నాగ్రరు పడె. ఇంకోసారి వాత రోగమొచ్చె. నానా తిప్పలుబడి ఈ మందు ఆ మందు తెచ్చి బాగుపడేదాకా దానికి సేవ జేత్తివి. కోలుకున్నట్లే ఉన్నా మునుపటోలె అది నీకు పన్జేత్తలేదనే గద, పది పదిహేను వేలెట్టి మల్లా ఓ ఎద్దును కొంటివి. ఇగ దీన్నెంత కాలం ఉంచుకుని చాకిరీ జేత్తవ్. ఇప్పుడో తీరుగున్నది గనుకనే అమ్మమంటన్న. పూర్తిగ చచ్చేదాక ఉంచుకుంటె మేత దండగ తప్ప ఏమొత్తది. పానముండంగ అమ్మితేనన్న ఇన్ని పైసలొత్తయ్ గాని. పైగా పొద్దున అప్పులిచ్చిన ఫైనాన్సోళ్లు గూడ వచ్చినట్లున్నరు. వాళ్ల బాధ తీరాలంటే ఈ ముసలి ఎద్దును ఎంతకోకంతకి అమ్ముకుంటె నీ అప్పు కొంతలో కొంత తీర్తది గదా? వాల్లు మళ్ల కొన్ని రోజులదాక నీ ఇంటి మీదికి రాకుండ ఉంటరు గదా?" అంటూ మంచి సలహా ఇస్తున్న ఆప్తునిలా గురవయ్య భుజం తట్టాడు.

గురవయ్యలోని ఆవేదనని లక్ష్మయ్య మాటలు మరింత ఎక్కువ చేస్తున్నాయి. లక్ష్మయ్య చేయి విదిలించుకుని బండమీదినుండి లేచి బసవడి ముందున్న గడ్డిని దాని నోటికందిస్తూ ఆప్యాయంగ నిమురుతూ ఏం మాట్లాడలేక పోయాడు.

"ఏం మాట్లాడవేంది? నేనేదో వాల్లిచ్చే కమీషనుకు ఆశపడి చెప్తన్నానని అనుకోకు గానీ, మల్లీ లారీ ఎప్పుడొచ్చేది తెల్వదు. అప్పటిదాకా నీ బసవడు బతికేటట్లు గూడా నాకనిపిస్తల్లేదు. చాన దగ్గరపడ్డది. ఎందుకొచ్చిన ఆరాటం చెప్పు? బాగా ఆలోచించి మంచి నిర్ణయం తీస్కో. నేను మల్లీ రేపొద్దునొత్త" అని చెప్పి పోతున్న లక్ష్మయ్య మాటలేమీ గురవయ్య చెవిలో పడ్డట్టు లేవు.

గురవయ్య ప్రేమతో బసవన్నను నిమురుతుంటే అది తోకనాడిస్తూ, ఓ కన్ను మూసి తెరుస్తూ హాయిననుభవిస్తూ నెమరు వేస్తోంది. గురవయ్య కూడా గతాన్ని నెమరువేసుకోసాగాడు.

◆◆◆

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం కరువొచ్చి మేతలేక ఒక ఎద్దు చచ్చిపోయింది. ఉన్న ఒక్కదాన్ని కూడా అమ్ముతానంటే పున్నమ్మ అడ్డుపడి తన పుస్తెలు తాకట్టుబెట్టి ఈ ఎద్దును కొనిపించింది. తనింట్లోని పశువులను పున్నమ్మ ఏనాడూ జంతువుల్లా చూసేది కాదు. వాటికి కూడ తన బిడ్డలకులాగే పేర్లు పెట్టుకుంది. అదిగో అలా వచ్చిన రోజునే ఈ ఎద్దుని చూసి బసవడని పేరు పెట్టి బసవా! బసవన్నా! అని పిలుచుకుంటోంది. ఈ బసవన్న వచ్చిన ఏడు వానలు కూడా బాగా పడినయి. బాయిల పుష్కలంగ నీళ్లు చేరి ఏండ్ల నుండి పండని బీడు కూడా పండి సూపెట్టింది.

అలా రెండు మూడేళ్లు వానలు పడి ఉన్న పదెకరాలు పుట్లకొద్ది పంట పండింది. పున్నమ్మకు పుస్తెలతో పాటు రెండు వరుసల తాడు కూడా చేయించిన. ఆ ఏళ్ల నుండి బసవడిని కన్నబిడ్డలాగ సాకుతున్నం. సంక్రాంతికి జరిగే ఎడ్ల పందేల్లో ఎన్నోసార్లు గెలిచి తన పరువు నిలబెట్టింది. పందెంలో గెలిచినోల్ల బండి బయల్దేరినంకనే మిగతా బండ్లు బయల్దేరి ఊర్లో వీరన్న జాతర ప్రారంభమయ్యేది. ఆ గౌరవం కూడా బసవడి వల్లే కదా తమకు దక్కింది.

నాగ్రరు పడ్డప్పుడు, వాతరోగమొచ్చినప్పుడు లచ్మయ్యలాంటోళ్లు దాన్ని అమ్మమని ఎన్నోసార్లు ఉచిత సలహాలిచ్చారు. అయితే అవన్నీ వాళ్ల ఓర్వలేనితనంగా తనకు తోచడం వల్ల ఆ ఆలోచనే రానియ్యలేదు.

"ఏందయ్యా! గా లచ్మయ్యేందో వచ్చి పోతాండు. ఏందంట?" అంటూ చాటలో తౌడు పోసుకుని వచ్చి కుడితిలో నీళ్లు, తవుడు పోసి కలుపుకుంట అడిగింది పున్నమ్మ.

ఆమె మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు గురవయ్య.

"గదేనే. ఎడ్లను తోలకపోను రేపు పెద్దబండొత్తాదంట. బసవడిని తోలమని చెప్పడానికొచ్చిండు" అన్నాడు మెల్లగా చెవిలో పెట్టుకున్న సుట్ట తీస్కొని.

"ఏంది బసవన్నను బండెక్కియ్యమంటాండా" అంది పున్నమ్మ కుడితిని కలపడం ఆపి.

"అవునే. ఎట్టాగూ వయసైంది గద. ఇంకెన్నాళ్లు ఈ కట్టం అంటాండే" అన్నాడు సుట్ట వెలిగించుకుంటూ.

"దానికి నువ్వేమన్నవ్" అన్నది పున్నమ్మ.

"నేనేమన్లేదే. ఆయనే రేపొద్దున వత్తా. ఆలోచించుకోమని చెప్పిపోతాండు" అన్నాడు సుట్ట తాక్కుంటూ.

"మరి ఏమనుకుంటాన్నవ్?" అంది మెల్లగా దగ్గరికి వచ్చి.

"ఏమోనే! ఏం తోస్తలేదు. తెల్లారితే మల్లా ఫైనాన్సోలొత్తరు. ఊర్ల ఎవర్నడగ బోయినా గిదే ముచ్చట. బసవడిని పెట్టుకుని

మాకాడికొత్తన్నావ్. మేముకూడా నీ లెక్కన తీస్కొని తిప్పలుబడ్తాంటిమి అంటాండ్రు. ఇగ తప్పేటట్టు లేదు" అన్నాడు ఆ పని చేయడానికి ఇష్టం లేక, మనసు రాక సతమతమౌతూ.

పున్నమ్మకు మాత్రం దుఃఖంతో కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ నీళ్లు కుడితిలో రాలి కనిపించడంలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తమ కన్నీళ్లు ఎవరికీ కనిపించట్లేదని బాధతో మూలిగింది బసవడికి కుడితి పెడుతున్న పున్నమ్మ మనసు.



♦♦♦

ఆ రోజు రాత్రి కాస్త ఎంగిలి పడి వేపచెట్టు కింద మంచమేసుకుని పడుకున్నాడే కానీ, గురవయ్యకు నిద్ర రావడం లేదు. ఈ రాత్రి గడిస్తే అటు ఫైనాన్సోళ్లు, ఇటు లక్ష్మయ్య వచ్చేస్తారు. తన దైన్యాన్ని ఆసరా చేసుకుని కమీషను కోసం ఆశపడుతున్న స్వార్థపరుడు లక్ష్మయ్యకు ఏం చెప్పాలో, అప్పు తీసుకుని కట్టలేని తన దుస్థితికి ఎలా గడువు అడగాలో తెలియక మదనపడుతున్నాడు గురవయ్య. చినుకు తడికో, అతనిలోని బాధ సెగకో తెలియదు కానీ మొత్తానికి ఉక్కబోతగా, చాలా అసనహంగా ఉంది. టపుక్కున రాలి పడ్డ వేపకాయ అతన్ని ఆలోచనలనుండి తట్టి లేపింది. ఇటు పక్కకు తిరిగి పడుకుని చూడగా అతని మంచం దగ్గరే తోకాడిస్తూ పడుకున్న తన పెంపుడు కుక్కను చేత్తో తడిమి, బలవంతంగా నిద్ర పోడానికి ప్రయత్నిస్తూ కళ్లు మూసుకున్నాడు. ఎప్పటికో మెల్లగా నిద్రపట్టింది.

భౌ... భౌ మని కుక్క అరిచేసరికి చటుక్కున లేచి కూర్చున్నాడు. చూస్తే ఎవరూ లేరు. ఎందుకైనా మంచిదని అతని మంచం పక్కనే పెట్టుకున్న కర్రను తీసుకుని నిలబడి చుట్టూ చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. పున్నమ్మ అరుగుమీద నిద్రపోతోంది. కుక్కమాత్రం అరుస్తూనే ఉంది. దాని అరుపు ఎక్కువయ్యేసరికి పున్నమ్మ కూడా లేచింది.

"ఏందయ్యా! కుక్క బాగ మొరుగుతాంది. ఏం కనపడ్డదని" అంటూ దీపం పట్టుకుని చెట్టుదగ్గరికి వచ్చింది.

"ఏమోనే! నాకైతే ఏం కనపడుతలేదు. మరెందుకు మొరుగుతాందో అర్థమైతలేదు" అని దీపం వెలుగులో చుట్టూ చూస్తున్న ఇద్దరికీ మంచం కోడుకి చుట్టుకుని పడగ విప్పబోతున్న నాగుపాము కనిపించింది. అప్పుడు అర్థమైంది వాళ్లకు కుక్క ఎందుకు మొరుగుతోందో. కుక్క దాన్ని చూసి ఇంకా ఎక్కువ మొరుగుతోంది.

గురవయ్యకు అంత పెద్ద పాముని చూడడం కొత్తేమీ కాదు కాబట్టి కంగారు పడకుండ చేతిలో ఉన్న కర్రతో కొట్టి చంపేశాడు. దాన్ని జాగ్రత్తగా తీసుకుపోయి దూరంగా వేసొచ్చాడు.

పున్నమ్మ ఒకింత భయంతో "ఎంత అలవాటున్న పాములే అయినా మన ఖర్మం సరిపోకుంటే పానాలు పోవుడే గదయ్యా. నేను చెప్తనే ఉన్న. ఈ తీరుగున్నప్పుడు పాములు, తేళ్లు గట్ర బైటికెళ్తయ్. చెట్టుకింద పండుడు వద్దని. వింటవా. పొలంల తిరిగేటోల్లం. మనకేం భయమే అంటివి. ఇప్పుడు కొంచెం అటుఇటు ఐతే ఏమన్నుండునా అనుకుంట భయంతోనో, భక్తితోనో పుస్తెలు తీసుకుని కళ్లకద్దుకుంది. మంచాన్ని చెట్టుకింద నుండి తీసి అరుగు దగ్గరగా వేసి పడుకుంది.

గురవయ్యకు పున్నమ్మ అమాయకత్వానికి, ఆమెకు తనమీదున్న అభిమానానికి ఏమనాలో తెలియక కాళ్లు కడుక్కుని వచ్చి పడుకున్నాడు. ఎదురుగా బసవడు ప్రశాంతంగా మేత మేస్తూ కనిపించాడు. మళ్లీ గురవయ్యలో అంతర్మధనం మొదలయింది. తను పెట్టే ఎంగిలి కూడు తిన్న కుక్క విశ్వాసం చూపెట్టి పామునుండి తన ప్రాణాలను కాపాడింది. మరి ఇన్నాళ్లు బసవడితోనే సహజీవనం చేసి, పుట్లకొద్ది పంటలు తీసి, పుట్టెడు ఊడిగం చేయించుకుని, ఆరుగాలం కష్టసుఖాల్లో పాలు పంచుకుని తనతో సహవాసం చేసిన బసవడిని వయసైపోయిందని, విశ్వాసం లేక దాని సేవలు మర్చిపోయి కబేళాకు పంపడానికి ఆలోచన చేస్తాండు. నిజంగా అదే జరిగితే బసవడి ఉసురు తప్పక తగులుతుంది. ఇంతకుముందు ఇట్లనే అమ్ముడు పోయిన పశువులన్నింటి ఉసురు తగిలి ఇప్పుడీ గడ్డుకాలం వచ్చిందేమో? అంతులేని బాధతో మనసంతా దహించుకుపోసాగింది. ఆ బాధలోనే తానుమాత్రం కుక్కకంటే హీనం కాదల్చుకోలేదు. రొమ్ముపాలు తాగింది మర్చి కన్నతల్లిని కాటికి పంపదలచుకోలేదు. ఏదో ఒక మంచి నిర్ణయానికి వచ్చినవాడై ప్రశాంతంగా నిద్రపోయాడు.

♦♦♦

ఎప్పటిలాగే తెల్లవారింది. సూరీడుతోటే లక్ష్మయ్యా వచ్చాడు. కానీ గురవయ్య తన అభిప్రాయాన్ని లక్ష్మయ్యకు సూటిగా చెప్పాడు. అతను ఇంకేదో సర్ది చెప్పబోయాడు. ఆడ నిలబడడం ఇష్టం లేక వెనుతిరిగాడు గురవయ్య. బసవడు కసాయివాళ్లకు తనను అమ్మనందుకు కృతజ్ఞతతో లేక ఇంకా చేవ వుందని చెప్పడానికో, ఏ భావమో తెలియదు కానీ లేచి నిలబడింది. పున్నమ్మ మనసు కూడా చాలా తేలిక పడింది. తమ ముగ్గురి సహజీవనం ఇలాగే కొనసాగుతుందని చెప్పడానికన్నట్లు గురవయ్య బసవన్న కట్లు తీసి బాయి దగ్గరికి తీసుకుపోయి ఆత్మీయంగా, శుభ్రంగా కడుగుతుంటే, పున్నమ్మ పేడ తీసి కొట్టమంతా చీపురు పట్టి ఊడ్వడంలో నిమగ్నమయింది. లక్ష్మయ్య ఇంకేం మాట్లాడలేక, వారిద్దరికీ ఏ విధంగానూ సర్ది చెప్పలేక తనలో తనే ఏదో గొణుక్కుంటూ వెనుతిరిగాడు. బహుశా బసవన్న వల్ల తనకు రావాల్సిన కమీషన్ తప్పిపోయిందని కాబోలు.

★

హ్హా... హ్హా...

ఆలస్యం

టీచర్: మరీ ఇంత ఆలస్యం అయ్యిందేం?

విద్యార్థి: పాపం ఓ ముసలాయన 5 రూపాయల బిళ్ల పోగొట్టుకున్నాడు టీచర్.

టీచర్: అయితే నీకెందుకు ఆలస్యమైంది?

విద్యార్థి: మరి అది నా కాలు కిందే కదా వుంది?!

వికాసం



ఆరోగ్యంగా జీవించాలనే ఆలోచనతో ఇతరులు చెప్పిన విధంగా ఆహారపు అలవాట్లను మార్చేసుకుంటాం. ఇలా గుడ్డిగా అనుకరించడం అంత వాంఛనీయం కాదు. అతిగా తిన్నా, చాలినంత తినకపోయినా శరీరానికి ఇబ్బంది కల్గుతుందని మనందరికీ తెలిసిన విషయమే. పంచదార తింటే చనిపోరు. పీచు పదార్థాలు ఎక్కువగా తింటే అనారోగ్యాల నుండి రక్షణ పొందలేరు. చెడు ఆహారం అనేది ఏదీ లేదు. ఉన్నవి చెడు ఆహారపు అలవాట్లు మాత్రమే. ఇప్పుడు న్యూట్రిషన్ అనేది ఒక సైన్సుగా మన మధ్యకు చొచ్చుకుని వచ్చింది. దాని ఆధారంగా మంచి ఆహారం - మంచి ఆరోగ్యంపై దృష్టిని నిలిపి తెలుసుకుంటున్నారు. అయితే ఆహారం గురించి అధికంగా సమాచారం వస్తుంటే ప్రజల్లో ఒక రకమైన సందిగ్ధత ఏర్పడుతోంది. అందుకే ఆహారానికి సంబంధించిన కొన్ని అపోహలు - యదార్థాలు తెలుసుకుందాం.

ఆహారం అపోహలు - యదార్థాలు

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

కొలెస్ట్రాల్ లేని ఆహారం తీసుకోవాలంటుంటారు. కానీ కొలెస్ట్రాల్ ప్రమాదకారి కాదు. రక్తంలో ఉండే సీరం కొలెస్ట్రాల్ స్థాయి ఎక్కువైతే గుండె జబ్బులు, గుండెపోటుకు కారణం అవుతుంది. తిండిలో కొలెస్ట్రాల్ గల పదార్థాలు ఉంటే సీరం కొలెస్ట్రాల్ స్థాయి పెంచే ఒక అంశంగా మాత్రమే ఉంటుంది. తినే తిండిలో ముఖ్యంగా సంతృప్త కొవ్వులు ఏ పరిమాణంలో ఉన్నాయనే దానిమీద ప్రమాదం ఆధారపడి ఉంటుంది. ఈ సంతృప్త కొవ్వు పదార్థాలు ఎక్కువగా పందిమాంసం, గొడ్డుమాంసం, గొర్రె మాంసం వంటి వాటిల్లో ఎక్కువగా ఉంటుంది. ఇవి భుజించడం వల్ల మామూలు పదార్థాల వల్ల సీరం కొలెస్ట్రాల్ స్థాయి ఎంత పెరుగుతుందో దానికి రెట్టింపు పెరుగుతుంది. అందుకే వీటిని తినడం హానికరం. తక్కువ కొవ్వు గల పదార్థాలు తినేటప్పుడు గుడ్డు తినడం వల్ల సీరం కొలెస్ట్రాల్ స్థాయిలో పెద్దగా తేడా రాదు.

కాల్షియం టాబ్లెట్లు

కాల్షియం టాబ్లెట్లు వేసుకుంటే ఆస్టియో పోరోసిస్ (ఎముకల వ్యాధి) రాదని అపోహపడకూడదు. ఈ వ్యాధి రావడానికి కాల్షియం లేమి ఒక కారణం కావచ్చుగానీ అదొక్కటే కారణం కాదు. అందువల్ల సమస్య పరిష్కారానికి దీనిని తీసుకోవడం పూర్తి పరిష్కారం కాదు. కాల్షియం టాబ్లెట్లు తీసుకుంటే బలహీనమైన ఎముకలు బలంగా తయారుకావు. పొగతాగడం, ఆల్కహాలు సేవించడం, వ్యాయామం చేయకపోవడం వంటి వాటివల్ల ఎముకలు బహీనపడతాయి. ఒక న్యూట్రియంట్ భారీగా తీసుకుంటే అది శరీరం గ్రహించే ఇతర న్యూట్రియంట్ వ్యవహారంలో కలుగజేసుకుని ఆ పని సక్రమంగా జరగకుండా అడ్డుపడుతుంది. ఉదాహరణకు కాల్షియం తీసుకుంటే శరీరం ఐరన్ పీల్చుకునే సమయంలో అది అడ్డుపడుతుంది. ఆరోగ్యకరమైన తిండి తినేవారు కాల్షియం అదనంగా తీసుకోవడం వల్ల ఇబ్బంది ఉండదు. కాని ఎక్కువ డోసులో తీసుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. రోజుకు 500 మిల్లీగ్రాములకు మించి తీసుకోకూడదు.

పీచు పదార్థాలు

తక్కువ కొవ్వు, ఎక్కువ పీచుగల ఆహార పదార్థాలు తినడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. వయోజనులు రోజుకు 20 నుండి 30 గ్రాముల పీచు పదార్థాలు తినడం మంచిదే. మంచిదని మరీ ఎక్కువగా ఏది భుజించినా చెడు ఫలితాలు వస్తాయి. కరగని పీచుగల ఆహార పదార్థాలు తింటే అవి ఐరన్, కాల్షియంలను కట్టి పడేసి శరీరానికి అందుబాటులో లేకుండా చేస్తాయి. కొత్త సమస్యలు సృష్టిస్తాయి. ముఖ్యంగా గర్భిణీలకు సమస్యగా తయారవుతుంది.

కాఫీ తాగొద్దు!

పంచదార మాదిరి కాఫీకి కూడా చెడ్డ పేరు ప్రచారమవుతోంది. దీనిమీద అనేక ఆరోపణలున్నాయి. వీటిలో ఎక్కువ శాస్త్రీయంగా పరిశోధనలు చేసి చెపుతున్నవి కావు. కాఫీకి క్యాన్సర్‌కు, గుండె జబ్బులకు ముడిపెడుతున్నారు. అయితే చాలామందికి రోజుకి రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల ఎటువంటి హానీ జరగదు. కాఫీలో పౌష్టికత ఏమీ వుండదు. అది మనిషిలో ఉత్తేజం కలిగించగల ఒక ద్రవపదార్థం. కొంతమందికి 'కెఫిన్' పడదు. అటువంటి వారు కాఫీ తాగితే గుండె కొట్టుకునే రేటు పెరుగుతుంది. నరాలు బలహీనపడతాయి. కాఫీ సేవించడం వల్ల అది శరీరం చేత నిల్వ ఉన్న కాల్షియంను విసర్జింప చేసే ప్రయత్నం చేస్తుంది. దానికి గల ఆమ్ల స్వభావం కారణంగా లేత జీర్ణాశయాలపై (పసి మరియు చిన్న పిల్లలు) ప్రతాపం చూపుతుంది. తీవ్రమైన అనారోగ్యంలో వున్నప్పుడు కాఫీని నిషేధించాలి. లేకపోతే ఇది అటువంటి శరీరాల్లో విలన్ పాత్ర పోషిస్తుంది. రోజుకి ఒకటి లేదా రెండు కప్పుల కాఫీ తాగితే పెద్దగా ప్రమాదాలు ఉండవు కానీ, శృతిమించితే సమస్యల్లో ఇరుక్కుంటారు. గర్భిణీలు, స్తన్యం ఇచ్చే తల్లులు కూడా ఈ నియమం దృష్టిలో ఉంచుకోవాలి. కాఫీలో కొంచెం పాలు ఎక్కువగా కలుపుకోవడం వల్ల శరీరం కాల్షియాన్ని కోల్పోకుండా జాగ్రత్త పడొచ్చు.

ఉప్పుకి దూరం దూరం...

చాలామంది అభిప్రాయం ఉప్పు రక్తపోటు పెంచుతుందని. నిజానికి కొద్దిమంది విషయంలోనే రక్తపోటుకి, సోడియానికి (ఉప్పు) సంబంధం ఉంటుంది. దేనివల్ల రక్తపోటు పెరుగుతుందో స్పష్టంగా తెలియని కారణంగా క్షేమదాయకమని తిండిలో ఉప్పు తగ్గించమని సిఫార్సు చేస్తారు. రుచికోసం వంటల్లో ఉప్పును వాడతారు. కొంతమందయితే ఎంత విచిత్రంగా ఉంటారంటే తినే సమయంలో కంచంలో ఉప్పుకూడా వడ్డించుకుంటారు. ఇదొక అలవాటుగా వారిలో స్థిరపడుతుంది.

పంచదార తినొద్దు

తినుబండారాల్లో వాడే పదార్థాల్లో పంచదార చాలా చెడ్డపేరు తెచ్చుకుంది. నిజానికి పంచదార వల్ల క్యాన్సర్, డయాబెటీస్, మనిషి ధోరణిలో మార్పు, రక్తపోటులు పెరగడం వంటివి తలెత్తవు. కాకపోతే పంచదార ఎక్కువగా తింటే దంతక్షయం జరగవచ్చు. తమాషా ఏంటంటే చాలామంది పంచదారకు ప్రత్యామ్నాయంగా కృత్రిమంగా స్వీటెనర్స్ వాడుతుంటారు. ఇవి మనిషి బరువును అదుపులో ఉంచుతాయని ఎవరూ నిర్ధారణ చేయలేదు. తాజాపండ్లు కోసిన తర్వాత ఒక చెమ్చాడు పంచదార వాటిమీద చల్లి తినడం వల్ల ఏ విధమైన ప్రమాదం ఉండదు. ఒక చెమ్చాడు పంచదారలో 16 కేలరీలు ఉంటాయి. కానీ దానికి వెన్న, నెయ్యి వంటి కొవ్వు పదార్థాలు తోడైతే ఇబ్బంది. ఎందుకంటే ఒక చెమ్చాడు వెన్న అంటే 50 కేలరీలు.

తిండి విషయంలో అపోహలతో కూడిన నిబంధనలు పెట్టుకుని తింటే కావలసిన పౌష్టికత లభించదు. మీ వివేకం వినియోగించుకుని మోతాదు మించకుండా తింటే ఇబ్బందులు ఉండవు. ★

సందేహ నివృత్తి నిఘంటువు



'ఎందుకని? ఇందుకని!' పుస్తకం 'సందేహాల నివృత్తి నిఘంటువు' అంటే అతిశయోక్తి కాదు. చిన్నారుల నుండి విద్యాధికుల వరకూ అందరి బుర్రల్లో పుట్టలకొలది పుట్టుకొచ్చేవి సందేహాలే. ఎందుకు? ఎలా? అన్న ప్రశ్నల నుండే మానవుడు సృష్టి రహస్యం తెలుసుకున్నాడు. ప్రకృతి ఎంత వాస్తవంగా కనిపిస్తుందో అంతకు మించి సందేహాలనూ కలిగిస్తుంది. 'ఆకస్మికంగా అనేకానేక మార్పులు ఎందుకు జరుగుతాయి? వాటి ప్రభావం ఏవిధంగా ఉంటుంది? ఈ భూమి, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గాలి, నీరు, చెట్లు ఇవన్నీ ఎలా వచ్చాయి?' వంటి సందేహాలకు మానవుడు సమాధానాలు తెలుసుకున్నాడు. తెలుసుకుంటున్నాడు. కానీ నూతన తరాలకు ప్రతిదీ అబ్బురంగా అనిపిస్తుంది. ఆ చిన్ని బుర్రల్లో వచ్చిన సందేహాలను విద్యాధికులు సైతం నివృత్తి చేయలేని స్థితి అందరికీ అనుభవమే. 'జిజ్ఞాస' నేటి చిన్నారుల్లో మరింత ఎక్కువ. ప్రపంచమంతా ఒక కుగ్రామమయ్యాక తెలుసుకోవడమూ తేలికైంది. అయితే సందేహాల నివృత్తికి ముందుగా అంతర్జాలంలోకే అడుగులేస్తోంది నేటి తరం. అయితే దానిలో విభిన్నకోణాల్లో విశ్లేషణలుంటాయి. అంతా మాయాజాలం.. ఏది సరైనదో తెలుసుకోవడం కష్టం. శాస్త్రీయ కోణంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలంటే ఇలాంటి పుస్తకాలే ఆధారం. సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మానవుడు విశ్వాసాల చుట్టూ తన జీవితాన్ని అల్లుకోవడాన్ని మాత్రం మానడం లేదు. దీనికి పరిష్కారమల్లా విజ్ఞానాన్ని విస్తరింపజేయడమే. నేడు కొత్త పరిశోధనల గురించి తెలుసుకోవడంతో పాటు పాతవి పునశ్చరణం కూడా అవసరమే.

అందుకే.. 'పాములకు వినపడుతుందా?', 'కన్ను అదిరితే?', 'పక్షులకు రంగు రంగుల ఈకలు ఎలా వస్తాయి?' వంటి ప్రశ్నలకే కాకుండా 'టైమ్ ట్రావెలర్స్, గ్రహాంతరవాసులకు తేడా ఏమిటి?', 'బిగ్‌బ్యాంగ్ ప్రయోగం' వరకూ అనేక సందేహాలను విపులంగా విశదీకరించారు రచయిత, చెకుముకి సంపాదకులు ప్రొ॥ ఎ.రామచంద్రయ్య. విజ్ఞానరంగంలో అనునిత్యం జరుగుతున్న మార్పులను గమనిస్తూ ఏ ప్రశ్నకైనా అలవోకగా, ఆసక్తికరంగా సమాధానం చెప్పగలగడం ఆయనకే సొంతం. 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రతివారం ఇచ్చే 'ఎందుకని? ఇందుకని!' శీర్షికలో ఇచ్చిన సమాధానాల సమాహారమే ఈ పుస్తకం. నేటికీ ఆ శీర్షిక అత్యంత ఆసక్తికరంగా నడుస్తూ, మన అవగాహనకు పదును పెడుతూనే ఉంది. '2012లో అందరం చనిపోతామా?' అంటూ అడిగిన ప్రశ్నకు శాస్త్రీయంగా బదులిస్తూ కుహనా వాదాలు ఎంత బూటకమో తేల్చి చెప్పారు. క్యాలెండర్ పుట్టుక, పరిణామం కూడా వివరించారు. 2012లో ప్రళయం వస్తుందన్న దానికి ఏ ప్రయోగశాలలో ఋజువులు లేవన్నారు. ఏమీకాదు. కంగారపడవద్దని భరోసా ఇచ్చారు. అంతేకాదు సామ్రాజ్యవాదుల వల్ల వచ్చే ప్రపంచయుద్ధాలూ, పర్యావరణ కాలుష్యాల పట్లే అప్రమత్తంగా ఉండాలన్న సామాజిక స్పృహనూ కలిగించారు. ఇవి తేదీలేమీ లేకుండానే అకస్మాత్తుగా సంభవిస్తాయన్న వాస్తవాన్ని వెల్లడించారు. 'పురాణ గ్రంథాలన్నీ కథలైతే రామసేతు మాటేమిటి?' అన్న ప్రశ్నకు 'రామసేతు' ప్రకృతి సిద్ధమైన సహజ నిర్మాణమేనని తేల్చి చెప్పారు. పనిగట్టుకుని కట్టింది కాదని, అందుకు భూగర్భ పరిశోధనలే తిరుగులేని సాక్ష్యాలన్నారు. మహత్తులున్న వ్యక్తులు చరిత్రలో లేరని, కథల్లోనే ఉన్నారన్న విషయం విశదమైతే పురాణాలు గాథలేనని విస్పష్టంగా చెప్పారు. ఇందులో అనేక సందేహాలను రచయిత శాస్త్రీయ, సామాజిక దృష్టితో నివృత్తి చేశారు. అలాంటి ఈ పుస్తకం ప్రతి ఇంటా ఉండవలసిందే.

ఎందుకని - ఇందుకని, ప్రొ॥ ఎ.రామచంద్రయ్య.

పేజీలు : 180, వెల : రూ.65, ప్రతులకు :ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

- శాంతిశ్రీ

కొత్త పుస్తకాలు

నిశిత పరిశీలన

సింహప్రసాద్ రచయితగా పాఠకులకు సుపరిచితులే! 'విశ్వమానవుడు'లోని కథలన్నీ బహుమతి కథలు. అంటేనే ఒక స్థాయి ఉన్న కథలనే అభిప్రాయం కలుగుతుంది. చదివాక ఆ భావన నిజమని తేలుతుంది. బతుకుతెరువుకోసం ఎక్కడికెళ్లినా వేళ్లని మరిచిపోవడం జరగదని చెప్పిన 'విశ్వమానవుడు' కథ నడిపిన విధానం బావుంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల జిమ్మిక్కులు, సినీతారలను రప్పించి పడే పాట్లను 'ఓ(టి)టు షో' హాస్యకథరూపంలో అందించారు. మసకబారిన అనుబంధాలను తిరిగి కలపాలని తాపత్రయపడే బామ్మ మనవడికి చేసే ఇంపైన ఉపదేశం 'ముడుపు' మనసుకు హత్తుకుంటుంది. నగరవాసి నిరాశావాదం, అంతలోనే తప్పని జీవనపోరాటం 'ఆశావహం' కథ. సంపాదనలో పడి కన్నతల్లిని, తోడబుట్టినవారిని మరిచిపోయేంతగా కుంచించుకుపోతున్న మనస్తత్వాల ప్రతిరూపం 'చిన్ని చిన్ని ఆశ' కథ గుండెను పిండేస్తుంది. మార్కెట్ మాయాజాలంలో పడి ఎండమావులవెంట పరిగెత్తే 'జీరో సైజు' కథ చదివి పాఠకులు వాస్తవాలు కొంతైనా తెలుసుకుంటే చాలు! 'హే రామ్' చిల్లరడబ్బులకోసం పంటిబిగువున కష్టాలను, కన్నీటిని భరించే కుర్రాడి ఆవేదన. అర్థంలేని అపార్థాలతో విడాకులు తీసుకోవాలనుకునే ఓ భర్తగారికి లాయరు లౌక్యంగా బుద్ధిచెప్పే కథ 'పెళ్లీ పెటాకులు'. కాంక్రీట్ అరణ్యాల్లో కొరవడుతున్న చెట్లు, జీవజాలానికీ... మానసిక ఎదుగుదలకు ముడిపెట్టిన 'ఆశ్రయం' కథ ఆలోచన రేకెత్తిస్తుంది. రేటింగ్స్‌కోసం ఛానళ్లు ప్రేక్షకుల మనోభావాలతో ఆడుకోవడం ఎంత బాహాటంగా జరుగుతుందో 'రియాల్టీ షో' తెలియజేస్తుంది. పల్లెటూరి అందాలు తెలియని పిల్లవాడు గ్రామంలో అడుగుపెడితే పొందే అనిర్వచనీయమైన అనుభూతి 'శైశవగీతి'. ఇందులో అదనంగా సింహప్రసాద్ ఇంటర్వ్యూ కాక, ఆయనకు నచ్చిన స్వీయ రచన 'నా ఇల్లు' కథ ఉంది. ఆ కథకూడా మనసులోకి జొరబడి అలజడిచేసే కథే! ఈ పుస్తకాన్ని ఓసారి సింహావలోకనం చేసుకుంటే రచయితకు మనుషులను, మనస్తత్వాలను నిశితంగా గమనించే అలవాటు ఉందని తెలుస్తుంది.

విశ్వమానవుడు, సింహప్రసాద్, పేజీలు: 134, వెల: 50/-,

ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు.

- కె. అరుణ

గిన్నెగూడు పక్షి

పిల్లలూ... ఈ వారం మీ ముందుకొచ్చిన పక్షి పచ్చకంటి సైదాపిట్ట. ఇది చూడ్డానికి పిగిలిపిట్ట కంటే కొంచెం చిన్నగా ఉంటుంది. దీని శరీర భాగం ఎంత పొడవుంటుందో తోకకూడా అంత పొడవుంటుంది. ఇది ఎక్కువగా చిట్టడవుల్లో కనిపిస్తుంది. దీని శరీరం పైభాగం లేత పసుపు, గోధుమ రంగులో, కింది భాగం తెల్లగా ఉంటుంది. ఈ జాతి పక్షులు ఐదారు కలిసి గుంపుగా తిరుగుతుంటాయి. చిన్న చిన్న పొదల్లోని కీటకాలను వేటాడి తింటాయి. ఇవే కాకుండా సాలెపురుగులు, మిడతలు కూడా వీటికి ఆహారమే. ఇవి శత్రువులకు కనపడకుండా భలేగా దాక్కుంటాయి. ఈ పక్షులు కలవరపాటుకు గురయినప్పుడు మాత్రం గట్టిగా ఏడుస్తున్నట్లు అరుస్తాయి. గుడ్లు పెట్టేకాలంలో మగపక్షులు పొదలమీదకి, దుబ్బులమీదికి ఎక్కి వినసొంపుగా పాడతాయి. ఇంకా వీటి గూడు ఎంత బాగుంటుందో తెలుసా? చాలా మెత్తగా వుంటుంది. ఎందుకంటే గూటిని మెత్తటి గడ్డితో ...టాయి. కొన్ని ప్రదేశాలలో వీటి గూళ్లు ఉయ్యాలలాగా చెట్లకు వేళ్లాడుతూ ఉంటాయి. ఈ గూళ్లు కూడా భూమికి రెండు మీటర్ల కంటే తక్కువ ఎత్తులోనే ఉంటాయి.

విహంగం

క్విజ్ మాస్టర్

1. సంవత్సరంలో పగలు ఎక్కువ ఉండే రోజు ఏది?
2. సంవత్సరంలో పగలు తక్కువ గంటలు ఉండే రోజు ఏది?
3. విమానం కనిపెట్టింది ఎవరు?
4. బల్బ్ కనిపెట్టింది ఎవరు?
5. భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉందని గుర్తించింది ఎవరు?

- అరవింద్, హైదరాబాద్

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.



ఎలా చేస్తే వస్తుంది?

ఫ్రెండ్స్... పైన కొన్ని గుర్తులు, అంకెలు ఉన్నాయి. వాటి సాయంతో 42-25=3+14. అని చూపించాలి. అది ఏ వరుసలో చేస్తే వస్తుందో చేసి చూడండే!

త్రిభుజాలెన్ని?

పిల్లలూ... పక్కనున్న బొమ్మలో మొత్తం ఎన్ని త్రిభుజాలున్నాయో లెక్కపెట్టి చెప్పండే!



జవాబులు

జవాబులు: 1. జులై 22, 2 ఫిబ్రవరి 22, 3.రైట్ బ్రదర్స్, 4 థామస్ అల్వా ఎడిసన్ 5. న్యూటన్

జవాబు : 19

ఎలా చేస్తే వస్తుంది?



సుడోకు నింపేద్దాం

7	9	1	2	3	8	5	4	6
3	4	6	5	9	1	8	2	7
8	2	5	4	7	6	9	1	3
5	6	2	1	4	7	3	8	9
1	3	4	9	8	5	6	7	2
9	7	8	6	2	3	4	5	1
6	8	3	7	5	2	1	9	4
4	5	7	3	1	9	2	6	8
2	1	9	8	6	4	7	3	5

7			2	3	8		4	
			5					
	2	5				9		
	6			4				9
	3			8			7	
9				2			5	
		3				1	9	
					9			
	1		8	6	4			5

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో మళ్లీ తొమ్మిది గళ్లు ఉన్నాయి. కొన్ని గళ్లలో అంకెలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు.
అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి.



నేర్చుకుందామా...

ఎంత సమయం?

ఇద్దరు కలిసి ఒక పనిని చేయాలి. మొదటి వ్యక్తి మొత్తం పనిని రెండు గంటల్లో చేయగలడు. రెండవ వ్యక్తి అదే పనిని మూడు గంటల్లో చేయగలడు. ఆ పనిని ఇద్దరూ కలిసి చేస్తే ఎంత సమయంలో చేయగలరో చెప్పండి.

టేబుల్ చేయడం ఎలా?



ఒక కార్పెంటర్ బాగా తెలివైనవాడు. ఎలాంటి చెక్కలను ఇచ్చినా చక్కటి వస్తువులను తయారు చేస్తాడు. ఇక్కడ బొమ్మలో చూపినట్లు మధ్యలో రంధ్రాలున్న రెండు వృత్తాకారపు చెక్కలతో ఒకటే పెద్ద చెక్కబల్ల తయారు చేశాడు. ఎలా తయారు చేశాడో మీరు చెప్పగలరా?

ఎంత సమయం? : మొదటి వ్యక్తి రెండవ వ్యక్తి కన్నా ఒకటిన్నర రెట్లు వేగంగా చేయగలడు. అంటే మొదటి వ్యక్తి 3/5, రెండవ వ్యక్తి, 2/3 వంతు పంచుకుంటే ఇద్దరూ ఒకే సమయానికి పనిని పూర్తి చేయగలరు. అలా చేస్తే ఒక గంటా 12 నిమిషాలలో పని పూర్తవుతుంది.
టేబుల్ చేయడం ఎలా? : మొదటి వృత్తాకారపు చెక్క మధ్యలో ఉన్న రంధ్రానికి సరిపడా చెక్కను రెండో చెక్కలోంచి చిన్న ముక్కలు చేసి మొదటి చెక్క మధ్యలో అతికించి రంధ్రం లేకుండా పెద్ద టేబుల్‌ని చేశాడు.

ఎన్నున్నాయ్?

చూడండి పిల్లలూ... ఎక్కడో అడవిలో ఉండాల్సిన చుంచెలుకలు ఇంట్లోకొచ్చి పదార్థాలన్నీ ఎలా పాడు చేస్తున్నాయో! మనం ఆరోగ్యంగా ఉండాలంటే వీటన్నింటిని తరిమి కొట్టాలి కదా. మరి అవన్నీ ఎక్కడున్నాయో, ఎన్నున్నాయో వెతికి లెక్కపెట్టండి.



మాటల కోట - 63

రూపకల్పన : కర్లపాలెం



అడ్డం :

1. నాలుగు పలుకుల చక్కెర (4)
4. తోటలో పిల్ల, కోటలో... (2)
5. అన్నం పెట్టే రైతు (4)
7. బండరాళ్లు పరిచిన నేల (2)
10. కనికట్టులో ఆకట్టు (2)
12. మణిరత్నం కుర్ర సినిమా (2)
13. ఆంధ్రా మీనాకుమారి (3)
15. భవంతి (4)
16. 'ర'లేని రభస (2)
17. తాష్కెంటు చిత్రోత్సవంలో అవార్డు సంపాదించిన తెలుగు సినిమా. శాల లేదు (3)
19. తొలిఝాము (3)
21. .... దోశ, వడ, అప్పడం, అని పిల్లలు పాడుకునేది (2)
23. ఎదగడానికెందుకురా ...., ఎదురు బతుకంతా చిందర వందర! (3)
24. స్నేహితురాలు (4)
25. పైడి తల్లిలోని బంగారం (2)

నిలువు :

1. రైతు కష్టానికి నిదర్శనం (2)
2. ఉదారం చివరిది సూదిలోకి ఎక్కించరాదా! (2)
3. వెన్న దొంగలో దొంగ దాక్కున్నాడు (2)
4. ఇది బాగుంటే పరీక్షల్లో మంచి మార్కులొస్తాయంటారు (2)
5. హల్లు కాదు (2)
6. నాగేందర్ ఇంటిపేరు, ఉదారంగా ఇచ్చేయ్ (2)
7. పొలం హద్దు (2)
8. రాం గోపాల్ వర్మ మొదటి సినిమా (2)
9. భరోసా చెదిరిపోయింది (3)
10. జూ. ఎన్టీఆర్, హన్సిక జంటగా నటించిన చిత్రం, అమ్మో! వాడా... మహా.... అని కూడా అంటుంటారు (2)
11. పవిత్రము (4)
12. యుద్ధము మధ్యలోకి పోవద్దు (2)
14. అటునుండి ఎండాకాలం (3)
15. పతి (2)
17. నవమిలోని అంకె (2)
18. 'నా తెలంగాణా - కోటి రత్నాల వీణ' అన్న కవి (4)
20. పొట్టి (3)
21. ఆమోదమునకు మోము లేదు (2)
22. ప్రాంతీయ ఉచ్చరణా విధానం (2)
23. ఆటల్లో మొండి (2)

మాటలకోట - 62 జవాబు

1 ధ	వ	2 ము	■	3 ప్ర	4 జ	■	5 ప్ర	6 భా
గ	■	7 స	న్నీ	■	8 న	టి	■	స్క
■	9 వే	లం	■	10 చీ	తా	■	11 గో	రా
12 చే	గం	■	13 మూ	ను	■	14 స	రే	■
డ	■	15 తా	ను	■	16 సం	గ	టి	■
■	17 మే	కం	■	18 దా	చు	■	■	■
19 బా	బు	■	20 కో	త	■	21 సో	య	22 గం
వి	■	23 పా	క	■	24 మై	దా	■	ధీ
25 ప	గ	టు	■	26 కొ	కు	■	27 హా	రం

హ్హా... హ్హా...

మార్పు

అధికారి: ఇంతకు ముందు చేసిన ఉద్యోగం ఎందుకు మానేశావు?

రామారావు: ఆ కంపెనీని మరో చోటికి మార్చారు. కాకపోతే ఎక్కడికి మార్చారో నాతో చెప్పలేదు.

ఫణి, నంద్యాల

విదేశీ ప్రయాణం

బాబీ: (పని మనిషితో...) విదేశీ ప్రయాణం చేసిన తొలి మహిళ ఎవరో తెలుసా?

రత్తాలు: ఓసోస్... తెలియకే. సీత.

రమ, హైదరాబాద్.

కనువిప్పు

చాలా కాలం క్రితం బృహద దేశాన్ని ఒక రాజు పాలిస్తుండేవాడు. అతను తాను చాలా తెలివైనవాడిననుకునేవాడు. ఆయనకు పొగడ్తలంటే మహా ఇష్టం. చిన్న పొగడ్తకు కూడా ఉబ్బిపోయేవాడు. తన తెలివితేటల్ని ఎవరైనా పొగుడుతుంటే సంతోషంతో మురిసిపోయేవాడు. ఆయన బలహీనత్త గమనించి కొందరు అదే పనిగా పొగుడుతూ, ఆయన్ని సంతోషపరిచి బహుమతులు అందుకునేవారు.

ఆ రాజుకు ఔషధాలు తయారు చేయడమంటే చాలా ఇష్టం. రకరకాల ఔషధాలు తయారు చేసి తన సేవకుల మీద ప్రయోగించేవాడు.

ఒక రోజు హఠాత్తుగా రాజుగారికి అమృతం లాంటి ఔషధాన్ని తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. అలాంటి ఔషధాన్ని తయారు చేసి తన దేశ ప్రజలందరి చేత తాగించి వారికి మరణమే లేకుండా చేయాలనుకున్నాడు. కొన్నాళ్లు కష్టపడి తన సేవకుల చేత అడవిలోంచి రకరకాల మూలికలు తెప్పించి, వాటిని ఉడికించి, ఏవేవో కలిపి చిత్రమైన ఔషధాన్ని తయారు చేశాడు. తను తయారు చేసిన 'అమృతం' గురించి దేశమంతా చాటింపు వేయించాడు. దాంతో ఈ విషయం దేశమంతటా పాకిపోయింది.

రాజుగారు అమృతం తయారు చేశారని, అది తాగిన మనిషికి చావే లేదని రాజ్యమంతా ప్రచారం అయ్యింది.

ఆ మాటలు కొందరు నమ్మారు. అయితే చాలామంది నమ్మలేదు. కానీ ఆ విషయాన్ని ఎవరూ ధైర్యంగా బయటికి చెప్పలేకపోయారు. చెబితే రాజుగారు తమ తల తీయిస్తారేమోనని భయంతో మౌనంగా ఉండిపోయారు.

అయితే రాజుగారి ఆస్థానంలో మల్లన్న అనే వ్యక్తి కొలువు చేసేవాడు. అతను తెలివైనవాడు. నిజాన్ని చెప్పడానికి భయపడేవాడు కాదు. అతనికి పొగడ్తలంటే గిట్టదు. తనకు తారసపడిన వాళ్లతో "ప్రకృతికి ఒక నియమం ఉంది. అదేమిటంటే పుట్టినవాడు ఏదో ఒక రోజు మరణించక తప్పదు. అలాంటప్పుడు రాజుగారు మనిషికి చావే లేని ఔషధాన్ని తయారు చేశారంటే నేను నమ్మను" అని చెప్పసాగాడు.

ఆ మాట ఆనోట ఈనోట పడి చివరికి రాజుగారి చెవికి చేరింది. రాజుగారు కోపంతో మండిపడ్డారు. మల్లన్నను తనముందు ప్రవేశపెట్టమని మంత్రిని ఆదేశించాడు. మంత్రి అతన్ని రాజుగారి దర్బారులో హాజరుపరిచాడు.

రాజుగారు అతన్ని చూస్తూ "నీకెంత ధైర్యం? నేను చేసిన ఔషధాన్ని నమ్మవా? నేను ఈ దేశానికి రాజునని నీకు తెలియదా? నేను తలచుకుంటే ఇప్పుడే నీ తల తీయించగలను" అన్నాడు.

సభికుడు రాజుగారికి నమస్కరించి "మహారాజా! మీరు నాకు అన్నదాతలు. మీకు నేను జన్మంతా రుణపడి ఉంటాను. అయితే నాకు సత్యమని తోచింది చెప్పకుండా ఉండలేను. మీరు తయారు చేసిన ఔషధానికి మనిషిని బ్రతికించే శక్తి ఉందని నేను నమ్మటం లేదు. మీరు ఈ ఔషధాలు తయారు చేస్తూ కాలం వ్యర్థం చేస్తున్నారు. ఆ సమయాన్ని ప్రజా పాలనకు, దేశాభివృద్ధికి కేటాయిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రజలు సుఖంగా ఉంటారు మహారాజా!" అన్నాడు.

ఆ మాటలతో రాజుగారి కోపం ఇంకా ఎక్కువైంది.

"నా ముందు ఇలా భయం లేకుండా మాట్లాడటానికి నీకెన్ని గుండెలు? నేను తలచుకుంటే ఒక్క క్షణంలో నీ మెడమీది తలకాయ ఎగిరిపోతుందని నీకు తెలియదా? నా ఔషధాన్ని నువ్వు నమ్మవా?" అంటూ రాజుగారు తాను తయారు చేసిన ఔషధాన్ని తెప్పించి మల్లన్నచేత తాగించాడు.

తర్వాత "ఇప్పుడు నువ్వు ఈ ఔషధం యొక్క శక్తిని అంగీకరించి నా గొప్పతనాన్ని పొగుడు. లేదా నీ తల... " అంటూ పళ్లు నూరాడు రాజు.

మల్లన్న తల వంచుకుని వినమ్రంగా "మహారాజా! మీ ఔషధాన్ని తాగాను. అందులో మీరు చెప్పే గొప్ప గుణమే ఉంటే ఇప్పుడు నేను మిమ్మల్ని పొగిడినా పొగడకపోయినా మీరు నన్ను చంపలేరు. ఎందుకంటే ఆ ఔషధాన్ని తాగిన మనిషికి మరణమే లేదు కదా? ఒకవేళ మీ చేతిలో నేను చస్తే మీ ఔషధంలో శక్తి లేనట్లు మీరు అంగీకరించాల్సి వస్తుంది. మహారాజా! చనిపోయిన మనిషిని బతికించగలిగే ఎలాంటి ఔషధాన్నీ మీరు తయారు చేయలేదు. ఇది సత్యం" అన్నాడు.

ఆ సమాధానం విన్న రాజు సిగ్గుపడ్డాడు. తన తప్పు తెలుసుకున్నాడు.

మల్లన్న మాటల్లోని సత్యాన్ని గ్రహించాడు. ముఖస్తుతి పట్ల తనకున్న బలహీనత కూడా ఆయనకు అర్థమైంది. రాజు నిండు సభలో అతగాడి తెలివితేటల్ని ప్రశంసించడమేగాక అతడికి తగిన బహుమానం ఇచ్చాడు. అటు తర్వాత రాజు పొగడ్తలకు పొంగిపోవడం మానేశాడు.

- రంగనాథ రామచంద్రరావు













రెక్కల ప్రపంచంలో...

ప్రకృతిలో ఎన్ని వింతలో. ఎన్నెన్ని విడ్డూరాలో. అందాకా ఎందుకు! ఒకేజాతి ప్రాణుల్లోనే ఎన్ని తేడాలో. పేరుకు మనం మనుషులమే అయినా ఎన్ని రకాలవారున్నారు?! పొట్టి, పొడుగు, తెలుపు, నలుపు, ఎరుపు, వంకుల జుట్టు, చువ్వల జుట్టు... అలా చెప్పకుంటూనే వుండొచ్చు. పక్షులైనా అంతే! చూడండి. ఎన్ని రకాలున్నాయో. ఏం రంగులు? ఏం హంగులు? ఏం హొయలు? ఎర్ర టోపీ తగిలించుకున్నట్టున్న పక్షి , హాయిగా ఈదులాడుతున్న బాతుపిల్ల, ఆహారం కోసం కీచులాడుకుంటున్న పక్షులు, తల్లి రెక్కలమీద వెచ్చగా ఒదిగి కూర్చున్న హంసలు, స్కూలు యూనిఫాం తొడుక్కున్న పిల్లల్లా కదిలిపోతున్న కొంగల గుంపు, ఇంద్రధనస్సు గౌను వేసుకున్నట్టున్న రంగురంగు ఈకల పక్షి...

అమాయకంగా...అందంగా...

మనసును కట్టిపడేస్తున్నాయికదూ.